

ఇద్దరు యువకుల మృతి బాధాకరం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పిఠాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వచ్చి రాజమహేంద్రవరం-కాకినాడ మధ్య గల ఏడీబీ రోడ్డు మీదుగా వెళుతూ ప్రమాదానికి గురై ఇద్దరు యువకులు మరణించడం బాధాకరమని.. ఈ సమాచారం తెలియగానే తీవ్ర ఆవేదనకు గురయ్యాయని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. మృతులు కాకినాడ సమీపంలోని గైగోలుపాడుకు చెందిన మణికంఠ, చరణ్ కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల వంతున జనసేన పార్టీ తరపున ఆర్థికసహాయం అందజేస్తామని ఆయన ఎక్స్(ట్విట్టర్) ద్వారా ప్రకటించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందజేయాలని కార్యాలయ అధికారులకు సూచించినట్టు తెలిపారు.గేమ్ చేంజర్ ఈవెంట్‌లో ఇళ్లకు సురక్షితంగా వెళ్లాలని ఒకటికి రెండుసార్లు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

ఇక నుంచి ఏడీబీ రోడ్డుపైనే పిఠాపురానికి

కాకినాడ-రాజమహేంద్రవరం నగరాల మధ్య ప్రయాణానికి కీలకమైన ఏడీబీ రోడ్డును గత ప్రభుత్వం ఐదేళ్లపాటు పట్టించుకోలేదని.. కనీసం నిర్వహణ పనులు చేయలేదని, విద్యుద్దీపాలు లేవని పవన్‌కల్యాణ్ విమర్శించారు. దీంతో ఈ రహదారిలో ప్రమాదాలు పెరిగాయని తెలిపారు. ఐదు నియోజకవర్గాలే కాక రెండు జిల్లాల మధ్య ప్రధాన రహదారిగా ఉన్న ఈ రోడ్డు పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి చేపట్టిందని చెప్పారు. అధ్వానంగా ఉన్న ఈ రహదారిని మెరుగుపరిచే పనులు జరుగుతున్న తరుణంలో ఇటువంటి ప్రమాదం జరగడం బాధ కలిగించిందని తెలిపారు. ఇక తాను పిఠాపురం నియోజకవర్గానికి వచ్చేటప్పుడు ఏడీబీ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగించాలని నిర్ణయించుకున్నట్టు పవన్ ప్రకటించారు.



ఉదయం లాకౌట్ సాయంత్రం ఓపెన్!

7

- ఏపీ పేపరుమిల్లు వద్ద ఉద్రిక్తత
- కార్మికుల ధర్నాతో మూసివేత
- ఫలించిన నాయకుల చర్చలు



రోడ్డు చేంజర్.. కూటమి

శరవేగంగా : సాగుతున్న ఏడీబీ రోడ్డు నిర్మాణపనులు

కూటమి వచ్చింది.. ఏడీబీ రోడ్డు బాగుపడింది

ప్రభుత్వం మారింది.. రోడ్డూ మారింది.. అదేమిటంటారా.. రోడ్లకు ప్రభుత్వానికి చాలా దగ్గర సంబంధం ఉంటుంది.. అది నిరూపించిందే.. రాజానగరం- సామర్లకోట ఏడీబీ రోడ్డు.. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. అంతే రోడ్డుకు శని పట్టుకుంది.. ఐదేళ్లూ కదల్లేదు.. రోడ్లంతా గోతులే.. ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.. ఎంతో మంది గాయాలపాలయ్యారు. ఎన్నో వాహనాలు పనికిరాకుండా పోయాయి.. ఆ రోడ్డులో వెళ్లాలంటేనే భయపడేవారు.. మళ్లీ 2024 వచ్చింది.. ప్రభుత్వం మారింది.. వైసీపీ హయాంలో ఐదేళ్లు సాగని పనులు.. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పునఃప్రారంభమయ్యాయి.. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పుడీ రోడ్డు సంగతెందుకంటారా.. శనివారం రాత్రి వేమగిరిలో జరిగిన గేమ్ చేంజర్ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు హాజరై తిరిగి కాకినాడ వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన ఈ రోడ్డపై అందరి దృష్టి పడేలా చేసింది. సాక్షాత్తూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ రహదారి నిర్మాణంలో గత ప్రభుత్వ వైఫల్యం గురించి ప్రస్తావించారు. దీనిలో భాగంగా ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- వైసీపీ హయాంలో నరకమే
- వందలాదిగా ప్రమాదాలు
- గాలిలో కలిసిన ప్రాణాలు
- వేలాది మందికి గాయాలు
- పట్టించుకోని పాలకులు
- 2018లో పనులు ప్రారంభం
- ప్రభుత్వం మారి ఆగిన పనులు
- కూటమి ప్రభుత్వంలో దృష్టి
- శరవేగంగా నిర్మాణ పనులు
- శనివారం ప్రమాదంతో కదలిక

సామర్లకోట/రంగంపేట/రాజానగరం జనవరి 6 : (ఆంధ్రజ్యోతి) : ఏడీబీ రోడ్డును తలచుకుంటే చాలు అటుగా తిరిగేవారెవరైనా అయ్యబాబోయ్ ఆ రోడ్డా అనకమానరు.. ఎందుకంటే అంత అధ్వానం..గత ఐదేళ్లలో ఎంతో మంది ప్రాణాలను బలితీసుకున్న రోడ్డు అది. అయినా గత వైసీపీ ప్రభుత్వంలో కనీస చలనం లేదు. ఐదేళ్లు ఆ రోడ్డు గోతులతోనే నిండి ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో రోడ్డుకు మహర్దశ వచ్చింది.వేగంగా రోడ్డు నిర్మాణపనులు సాగుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం హైవే-కాకినాడ పోర్టుకు అనుసంధానం చేస్తూ రాజానగరం నుంచి కాకినాడ వాకలపూడి లైట్‌హౌస్ వరకూ ఏడీబీ (ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రహదారి) రోడ్డును నిర్మించారు. 1991లో ఆసియా అభివృద్ధి బ్యాంకు నిధులతో ఈ రహదారిని 52 కిలోమీటర్ల మేర ఎంతో పటిష్టంగా నిర్మించారు.

వై..చీప్ పాలన

గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగా ఉన్న కాకినాడ నుంచి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు పెరగడం, రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టుకు ఈ రహదారి అనుసంధానమై ఉండడం వల్ల రోజురోజుకు వాహనాల రద్దీ పెరగడం వల్ల రాజానగరం నుంచి సామర్లకోట వరకు నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని 2014లో టీడీపీ, బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రతిపాదనలు తెచ్చింది. తదనంతరం 2018లో ఉమ్మడి జిల్లాలో రాజానగరం, రంగంపేట మీదుగా పెద్దాపురం, సామర్లకోట, రైల్వే వంతెన వరకు నాలుగు వరుసలుగా 30 కిలోమీటర్ల పొడవైన రహదారి నిర్మాణానికి నాబార్డు నిధులు రూ.300 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో కాంట్రాక్టర్ పనులు చేపట్టి కొంత వరకు పూర్తి చేశారు.మొత్తం రూ.250 కోట్ల వరకు నిధులు విడుదలయ్యాయి.2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత బిల్లులు మంజూరులో జాప్యంతో పనులు నెమ్మదించాయి.ఈ రహ దారి విస్తరణ పనుల్లో భాగంగా ఇరువైపులా లోతుగా తవ్విన ప్రాంతాల్లో గోతులు పూడ్చి పెట్టకుండా వదిలిపెట్టడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. వాహనాలు అదుపుతప్పి రహదారిపై తిరగబడి ట్రాఫిక్ నిలిచి ప్రయాణికులు అవస్థలు చవిచూశారు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు ఈ రహదారి నిర్మాణ పనులను పూర్తిగా గాలి కొదిలేసింది. దీంతో రహదారిపై ఏర్పడిన భారీ గోతులకు వాహనాలు ధ్వంసమైన దాఖలాలున్నాయి.ఎత్తు పల్లాల, గతుకుల కారణంగా ప్రయాణికులు ఈ రోడ్డుపై పడుతూ.. లేస్తూ ప్రయాణం సాగించక తప్పలేదు.ఎన్నికల ముందు అప్పటి సీఎం జగన్ ప్రచారయాత్ర ఈ ఏడీబీ రోడ్డు మీదుగానే సాగింది. నాడు రహదారి బాగుపడుతుందని అంతా ఆశించారు.కానీ కనీసం మరమ్మతు పనులు చేయకపోవడంతో వాహనదారుల్లో నిరాశే మిగిలింది. నిత్యం ఈ రహదారిపై ప్రయాణించే వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, ప్రయాణికులు నరకం చూశారు. కాకినాడ-రాజమహేంద్రవరం నాన్ స్టాప్ బస్సులు అనేకసార్లు ఈ రోడ్డులో గోతుల్లో ఇరుక్కుపోయిన ఘటనలు ఉన్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.45 కోట్ల మేర బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్లకు చుక్కలు చూపించింది. దీంతో వారు తీవ్ర నిరాశకు లోనై రోడ్డు నిర్మాణ పనులు అర్థంతరంగా ఆపేశారు. కాంట్రాక్టర్ యంత్రాలను తిరిగి తీసుకెళ్లిపోయారు.

నాడు దారి లేదు..



కూటమి మార్పు ఇది..

కూటమి ప్రభుత్వం వచ్చింది.. వెంటనే రహ దారి నిర్మాణంపై దృష్టి సారించింది. రాజానగరం నుంచి సామర్లకోట వరకు నాలుగులైన్లుగా నిర్మిస్తున్న ఏడీబీ రోడ్డు పనులు పెద్దాపురం, కోటపాడు, సూరంపాలెం ఆదిత్య దగ్గర పునఃప్రారంభించారు. ప్రస్తుతం గోతులతో వాహనాలు ప్రయాణం ఇబ్బందిగా ఉన్నచోట మరమ్మతులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనపర్తి, రాజానగరం, జగ్గం పేట, పెద్దాపురం,కాకినాడ రూరల్ ఎమ్మెల్యేల చొరవతో సీఎం చంద్రబాబు పెండింగ్ బిల్లులు చెల్లించడంతో ఏడీబీ రోడ్డు పనులు పునః ప్రారంభించారు. ప్రస్తుతం పనులు కోటపాడు వద్ద శర వేగంగా సాగుతున్నాయి.ఎక్కడైనా చిన్న గొయ్యిపడినా వెంటనే పూడ్చివేస్తున్నారు.

నేడు దారి చూపుతున్నారు..



ప్రాణాలు తీసిన చలిమంట

సజీవ దహనమైన దివ్యాంగుడు



నల్లజర్ల,జనవరి6(ఆంధ్రజ్యోతి): చలిమంట ఒక దివ్యాంగుడి ప్రాణాలు తీసింది. పోలీసుల కథనం ప్రకారం. నల్లజర్ల కోనేరు కాలనీకి చెందిన దానియేలు (24) నూనె ప్యాకెట్లు విక్రయించే దుకాణంలో పనిచేస్తుంటాడు.ఆదివారం రాత్రి భోజనం అనంతరం తాటాకు ఇంటిలో నిద్రకు ఉపక్రమించాడు.ఆ ఇంటి సమీపంలో దానియేలు తండ్రి రామకృష్ణ చలిమంట వేసుకుని కాసేపు కాగాడు.. ఆ తరువాత నిప్పు ఆర్పకుండా ఆరుబయట నిద్రపోయాడు.కాసేపటి తర్వాత చలిమంట నిప్పురవ్వలు తాటికిల్లుకు అంటుకుని మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది.స్థానికులు గమనించి రామకృష్ణను బయటకు తీసుకురాగా దివ్యాంగుడు దానియేలు మంటల్లో సజీవదహనమయ్యాడు.మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు.కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శోభనాద్రి తెలిపారు

సాంస్కృతిక శాఖకు దామెర్ల ఆర్ట్ గ్యాలరీ : దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 6(ఆంధ్రజ్యోతి): దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని సాంస్కృతిక శాఖకు బదలాయించేందుకు కృషి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్,ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ ఆవరణలో సోమవా రం మాదేటి రాజాజీ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ చిత్రకారుడు వరదా వెంకటరత్నం విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ శాఖ బిల్లులు చెల్లించలేని దుస్థితిలో ఆర్ట్ గ్యాలరీ ఉండడం దురదృష్టకరమన్నారు. ఎంతో విశిష్ట చరిత్ర కలిగిన దామెర్ల రామారావు ఆర్ట్ గేలరీ నిలబడడం వెనుక వరదా వెంకటరత్నం శ్రమ ఎంతో ఉందన్నారు. గేలరీని సాంస్కృతిక శాఖకు బదలాయించే విషయమై సాంకేతిక విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో చర్చిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సన్నిధానం శాస్త్రి, చిత్రకారులు కరణం నూకరాజు,టేకి మృత్యుంజయరావు,ఎస్ వీవీఎస్.లక్ష్మి,ఎన్ఎస్.శర్మ పాల్గొన్నారు.

లెప్రసీపై అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో లెప్రసీ వ్యాధికి గురైన వారిని గుర్తించాలని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం జాతీయ లెప్రసీ నిర్మూలన కార్యక్రమం (లెప్రసీ కేస్ డిటెక్షన్ - ఎల్‌సీడీ) ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. లెప్రసీపై అవగాహనకు 1310 బృందాలతో ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను సమన్వయశాఖల ఆధ్వర్యంలో చేపడతామన్నారు. మొత్తం 6,41,680 గృహాలను సందర్శన చేయనున్నామని పేర్కొన్నారు. జిల్లా లెప్రసీ అధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర,డీఆర్‌వో టి.సీతారామమూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బొమ్మూరు మురళీకొండపై నాలుగిళ్లు దోపిడీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు మురళీకోండపై నాలుగు ఇళ్లను దొంగలు దోపిడీ చేసారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం.. బొమ్మూరు మురళీకొండపై నివాసం ఉంటున్న ఆర్.నాని, ఐ.ఉమామహేష్,మధుసూదన్ రెడ్డి, కేవీ.రమణ వేర్వేరు చోట్ల నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి నలుగురి ఇళ్లల్లో ఒకేసారి చోరీలు జరిగాయి. ఈ నలుగురి ఇళ్లల్లో 360 గ్రాముల బంగారం ,రెండు లక్షల నగదు అపహరణ దోచుకు పోయారు.ఈ మేరకు నాలుగు సంఘటనలపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.దీంతో మురళీకొండ ప్రజలు భయాందోళన చెందుతున్నారు.ఈ నాలుగిళ్ల తాళా లు వేసి ఉండడం..ఎవరూ లేకపోవడం తో దొంగలు దోపిడీలకు తెగబడ్డారు.

6 ర్యాంపుల్లో సెమీ మెకనైజ్డ్ బోట్లకు అనుమతి

రాజమహేంద్రవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఇసుక సరఫరాలో మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని, 6 ర్యాంపులలో సెమీ మెకనైజ్డ్ బోట్లకు అనుమతివ్వనున్నామని, మరో 10 ఓపెన్ ర్యాంపుల గుర్తించి వాటి ద్వారా 77లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తేనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా కలెక్టర్ చాంబర్‌లో సోమవారం రాత్రి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు.జిల్లాలో 9 డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ప్రస్తుతం 6,47,252 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. దీని కోసం 115 బోట్స్‌మన్ సొసైటీలకు కాలపరిమితితో కూడిన అనుమతులు జారీ చేశామని, ఆలోగానే ఇసుక సరఫరా చేయాలన్నారు. బోట్స్‌మన్ సొసైటీలు కచ్చితంగా మార్గదర్శకాలు పాటించాలని, రవాణా వ్యవస్థ కోసం ర్యాంపుల వద్ద అనువైన వాతావరణం ఉండేలా చూసే బాధ్యత ఏజెన్సీలదేనని స్పష్టం చేశారు. ఓపెన్ రీచ్‌లలో మెకనైజ్డ్ బోట్ల ద్వారా 57,82,950 టన్నుల ఇసుక తీయడానికి పబ్లిక్ హియరింగ్ చేపట్టి టెండర్లు పిలవాలన్నారు. కొత్తగా గుర్తించిన కడియపులంక- వేమగిరి, పెరవలి-తీపర్రు ఏఅండ్‌బీ, నిడదవోలు-జీడిగుంట ఏఅండ్‌బీ, పందలపర్రు నమూనా ప్లాన్ టెండర్ ప్రక్రియ చేపట్టాలన్నారు.సమావేశంలో జేసీ ఎస్. చిన్నరాముడు,అదనపు ఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి, ఈఈ కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపు కోసం వివాదం

ప్రభుత్వ జనరిక్ షాపు కోసం రెండు గ్రూపుల మధ్య వివాదం

పోలీసులకు ఫిర్యాదు



రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనా సర్వజన ఆసుపత్రి (జీటీజీహెచ్) ఆవరణలోని ప్రభుత్వ జనరిక్ మందుల షాపు నిర్వహణపై సోమవారం రెండు మహిళా గ్రూపుల మధ్య వివాదం తలెత్తింది. తమకు జిల్లా మహిళా సమాఖ్య ఐదేళ్ల పాటు రెన్యువల్ ఇచ్చిందని ప్రస్తుతం నిర్వహిస్తున్న మహిళా గ్రూపు చెబుతుంటే.. ఇటీవలే కొత్తగా జిల్లా అధికారులు తమకు జనరిక్ మందుల షాపు నిర్వహణను అలాట్ చేశారని మరో గ్రూపు వాదిస్తోంది. దీంతో జీటీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే ... జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో జనరిక్ మందుల షాపు నిర్వహించుకోవడానికి 2019లో కాళీ కృష్ణ మహిళా సంఘానికి ఐదేళ్ల కాలపరిమితితో అనుమతిచ్చారు. అంతకు ముందు రెండేళ్లు ఇదే మహిళా సంఘం మందుల షాపు నిర్వహించింది. 2024 ఆగస్టు 14న దీని అనుమతి గడువు ముగిసింది. దీంతో మందుల షాపును ఖాళీ చేయాల్సిందిగా కాళీకృష్ణ మహిళా సంఘానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ నోటీసులిచ్చారు. అయినా ఖాళీ చేయలేదు. చివరకు తుది నోటీసు ఇస్తూ, రాజమహేంద్రవరానికి చెందిన ఆదిత్య మహిళా సంఘానికి జనరిక్ మందుల షాపును కేటాయిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో జనవరి 5వ తేదీలోగా ఖాళీ చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పష్టం చేసినా నిర్వాహకుల నుంచి స్పందనలేదు. ఈ నేపథ్యంలో ఆదిత్య మహిళా సంఘం ప్రతినిధులు సోమవారం జీటీజీహెచ్‌లోని జనరిక్ మందుల షాపు వద్దకు వచ్చి షాపు నిర్వహణను అధికారులు తమకు కేటాయించారని వెంటనే ఖాళీ చేయాలని చెప్పడంతో వివాదం ప్రారంభమైంది. తాను ఖాళీ చేసేది లేదని కాళీ కృష్ణ మహిళా సంఘం అధ్యక్షురాలు తనూజ, ఆమె మద్దతుదారులు జనరిక్ మందుల షాపు ఎదుట నిరసనకు దిగారు. రాత్రి సమయంలోనూ ఈ నిరసన కొనసాగుతూనే ఉంది. మరోపక్క కొత్త గ్రూపు ఆదిత్య మహిళా సంఘం స్నేహాంజలి యాదవ్, ఆమె మద్దతుదారులు ఆసుపత్రి ఆవరణలోనే ఉన్నారు.

ఐదేళ్లకు రెన్యువల్ ఇచ్చారు : తనూజ

2017లో నాకు జనరిక్ షాపు ఇచ్చారు. ఆ తర్వాత 2019లో ఐదేళ్లకు రెన్యువల్ ఇచ్చారు. ఇటీవలే 2029 వరకూ నాకు జిల్లా సమాఖ్య రెన్యువల్ ఇచ్చింది. ఖాళీ చేయమని నాకు ఎవరూ చెప్పలేదు.

కలెక్టర్ మాకు ఆర్డర్ ఇచ్చారు : స్నేహాంజలి యాదవ్

ప్రభుత్వాసుపత్రిలోని జనరిక్ మందుల షాపును జిల్లా కలెక్టర్ తమకు కేటాయించారు. సూపరింటెండెంట్ ఇచ్చిన ఉత్తర్వులు తీసుకుని తాము జనరిక్ మందుల షాపు దగ్గరకు వెళితే వాళ్లు రానీయడంలేదు. ఈ విషయాన్ని ఆసుపత్రి అధికారులకు, జిల్లా అధికారులకు తెలియపరిచాం. జన ఔషధి పేరుతో తమకు ఈ షాపు కేటాయించారు.

ఓటర్లు 16,20,888

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జనవరి6 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్ఆర్ 2025 ప్రకారం జిల్లాలో 16,20,888 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సోమవారం తుది జాబితా ప్రకటించారు. పురుషులు 7,91,043 మంది, స్త్రీలు 8,29,750 మంది, థర్డ్ జండర్ 95 మంది ఉన్నారన్నారు.

గ్రాడ్యుయేట్లు 64,441

జిల్లావ్యాప్తంగా 82 పోలింగ్ కేంద్రాల పరిధిలో 63,441 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు నమోదయ్యారన్నారు. పురుషులు 36,714 మంది, మహిళలు 26,725 మంది థర్డ్ జెండర్ ఇద్దరు ఉన్నట్టు తెలిపారు.త్వరలోనే పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయన్నారు.

పీజీఆర్ఎస్‌కు 120 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు డీఆర్‌వో టి.శ్రీరామ మూర్తితో కలిసి 120 అర్జీలు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజల చెంతకు కలెక్టర్

నల్లజర్లలో పీజీఆర్ఎస్‌కు హాజరైన కలెక్టర్ ప్రశాంతి

వెల్లువెత్తిన సమస్యలు.. పలువురు అధికారుల గైర్హాజరు

నల్లజర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ప్రశాంతి రూటు మార్చారు.. ప్రజలు సమస్యలు పరిష్కరించమని ఆమె వద్దకు రావడం కాదు.. సమస్యలు తెలుసుకోవడానికి ఆమె ప్రజల వద్దకు వెళుతున్నారు. దీనిలో భాగంగా సోమవారం నల్లజర్ల మండల కేంద్రంలో నిర్వహించిన పీజీఆర్‌కు ఆమె హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇక నుంచి ప్రతి వారం ఒక మండలంలో పీజీఆర్‌కు హాజరవుతానని చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించగా భూ సమస్యలు వెల్లువెత్తాయి. నల్లజర్ల సెంటర్‌లో ఆర్అండ్‌బీ అక్రమణలు తొలగించకుండా డివైడర్ వేయడం ద్వా రా ప్రమాదాలకు గురై పలువురు మృత్యువాత పడుతున్నారని గ్రామానికి చెందిన పులి బాలాజీ, కండెపు శ్రీనివాస్, కండెపు వెంకటరత్నం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నల్లజర్లలో సర్వీస్ రోడ్డు ఇరుకుగా ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని గుంటముక్కల వేణు ఫిర్యాదు చేశారు. జగన్నాథపురం రోడ్డు అధ్వానంగా ఉందని రోడ్డు నిర్మించాలన్నారు.హైవే రోడ్డులో భూములకు కన్వెక్షన్ చేసిన సొమ్ములు రాలేదని రైతులు కలెక్టర్ వద్ద వాపోయారు. అయ్యవరంలో ఉన్న తన రెండెకరాల భూమిని కబ్జా చేసినట్టు రైతు కంచె వెంకట సత్యనారాయణ ఫిర్యాదు చేశారు.సింగరాజుపాలెంలో ఒక నాయకుడు తమ భూమిని కబ్జా చేశాడని ఒక వృద్ధురాలు కలెక్టర్‌కు విన్నవించింది. నల్లజర్లలో జగనన్న కాలనీకి రోడ్డు వేయడం లేదని గ్రామానికి చెందిన బావిరెడ్డి సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. చీపురుగూడెం గ్రామంలో రీసర్వేలో అవకతవకలు జరిగినట్టు రైతు కంపన దుర్గారావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పొలానికి దారివ్వడం లేదని నల్లజర్లకు చెందిన రైతు కూచిపూడి వెంకట రత్నం చెప్పగా వెంటనే వీఆర్వో లక్ష్మణమూర్తిని పంపించి దారి ఏర్పాటు చేయాలని ఆదేశించారు.సమా వేశానికి ఆర్అండ్‌బీ అధికారులు గైర్హాజరు కావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ స్వామినాయుడు,డీటీ శాంతిప్రియ,సివిల్ సప్లైస్ డీటీ సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.



నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

అట్టహాసంగా..


ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు


సీఎం రంగసామికి జ్ఞాపిక అందజేస్తున్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి

- యానాంలో ప్రజాఉత్సవాలు ప్రారంభం
- ఆకట్టుకున్న ఫల, పుష్ప ప్రదర్శన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

యానాం, జనవరి 6: యానాం ప్రజాఉత్సవాలు, ఫలపుష్పప్రదర్శనలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడికృష్ణారావు ఆధ్వర్యంలో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం ఈకార్యక్రమాలు నిర్వహించారు.వీటిని పుదుచ్చేరి సీఎం రంగసామి, స్పీకర్ సెల్వం, ఇతర మంత్రులు, అధికారులు ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన విక్టరీ ఈవెంట్స్ మేకర్స్ మేడిద విక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని శాస్త్రీయ, నృత్య పోటీలను నిర్వహించారు. యాంకర్ శాంతి తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. టాటానగర్‌కు చెందిన చౌడాన్స్, ఒడిస్సాకు చెందిన కాంతారప్రదర్శన, కోల్‌కత్తాకు చెందిన ఇండియన్ టాలెంట్ విన్నర్, పల్సర్ బైక్ రమణ, విశాఖపట్నానికి చెందిన విజ్జు షాడో ఆకర్షించాయి. ప్రజలు తరలిరావడంతో జీఎంసీ బాలయోగి క్రీడామైదానం జనసంద్రంగా మారింది.

ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభం

జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 23వఫలపుష్ప ప్రదర్శన ప్రారంభమైంది. మల్లాడి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అశోక్ అధ్యక్షతన ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, స్పీకర్ సెల్వం, మంత్రులు లక్ష్మీనారాయణ, జైకుమార్, తిరుమురుగన్, డిప్యూటీ స్పీకర్ రాజవేలు, ఎమ్మెల్యేలు అర్ముగం, లక్ష్మీకాంత్, ప్రకాష్, బాస్కర్, పరిపాలనాధికారి మునిస్వామి, వ్యవసాయశాఖ డీడీ జె.శివశుబ్రమణియన్ ఈ ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభించారు. ఈ ప్రదర్శన మూడు రోజులపాటు జరగనుంది. ఎస్పీ రాజశేఖరన్ నేతృత్వంలో సీఐ షణ్ముగం గట్టి బందోబస్తును నిర్వహించారు. వీటిలో వివిధ రకాల జాతులు ఫలపుష్పాలను ప్రదర్శనకు ఉంచారు.


పూలు, పండ్లతో తయారు చేసిన గుర్రపు బండి


పూలతో జంతువుల ఆకారాల తయారీ



రోజా పూలతో ఐలవ్ యానాం


వివిధ రకాల పూల మొక్కల ప్రదర్శన

హమ్మయ్య.. స్టెల్లా వెళ్లిపోయింది!



కాకినాడ సముద్ర జలాల్లో స్టెల్లా ఎల్ నౌక

- ఎట్టకేలకు కాకినాడ పోర్టు నుంచి బయలుదేరిన స్టెల్లా ఎల్ నౌక
- రేషన్‌బియ్యం ఎగుమతుల ఆరోపణలతో 55 రోజులపాటు నిలిచిన తొలినౌక

కలెక్టరేట్(కాకినాడ),జనవరి6(ఆంధ్రజ్యోతి: కాకినాడ సముద్ర తీరంలో లంగరు వేసుకుని 55రోజులపాటు నిలిచిపోయిన స్టెల్లాఎల్ పనా మానౌక సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు బయలుదేరింది. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్ని అనుమతులు ఇవ్వడంతో నౌక పశ్చిమాఫ్రికలో బెనిన్ దేశానికి పయనమైంది. ఈ నౌక 26రోజులపాటు పయ నించి బెనిన్ దేశంలో కొటోనౌ పోర్టుకు చేరుకో నుంది. అక్కడ పోర్టులో ఇక్కడినుంచి తరలించిన బియ్యం అన్‌లోడింగ్ చేస్తారు. ఈనెల 31కి గమ్యం చేరుకుంటుందని నౌక అధికారులు వెల్లడించారు. దీంతో స్టెల్లాఎల్‌నౌక కథ సుఖాంతమైందని వారు అంటున్నారు.

నవంబరు 11న స్టెల్లా నౌక కాకినాడ సముద్రతీరానికి వచ్చింది. దీనిలోకి 32,415 మెట్రిక్ టన్నుల బియ్యం లోడింగ్ చేసిన తర్వాత రేషన్‌బియ్యం ఉన్నాయనే ఆరోపణలతో లోడింగ్ నిలిపివేశారు. తొలుత కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తనిఖీలు చేశారు. తర్వాత డిసెంబరు 4న అధికారుల బృందం తనిఖీలు చేశారు. 12శాంపిళ్లు సేకరించి వాటిని పరీక్షించి పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. మొత్తంగా 1320మెట్రిక్ టన్నుల బియ్యం ఉన్నట్లు గుర్తించి వాటిని వారంరోజులపాటు శ్రమించి కాకినాడ పోర్టు ఒడ్డుకు చేర్చారు. అనంతరం ఈబియ్యం లోడింగ్ చేసిన సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై పౌరసరఫ రాలశాఖ 6ఏ కేసు నమోదు చేసింది. కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తు జరుగుతోంది. తర్వాత ఎగుమతికి సిద్ధంగా ఉన్న 19,695 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లోడింగ్ చేశారు. మొత్తంగా 52వేల మెట్రిక్ టన్నుల బియ్యం లోడింగ్ అవ్వడంతో సోమవారం తెల్లవారుజామున ఈ నౌక పశ్చిమాఫ్రికాకు వెళ్లిపోయింది.

రేషన్‌బియ్యం వల్లే నిలిచిన నౌక

భారీనౌకలో రేషన్‌బియ్యం ఉన్నాయనే కారణంతో కాకినాడ సముద్రతీరంలో తొలిసారి ఒకనౌక 55రోజులపాటు నిలిచిపోయింది.గతంలో ఎప్పుడూ నౌకలు ఆగిపోయిన దాఖలాలు లేవని అధికారులు అంటున్నారు. దీనివల్ల ఎగుమతిదారులకు డెమరేజ్ చార్జీలు భారీగా పడ్డాయని చెప్తున్నారు. పైగా నవంబరు, డిసెంబరు నెలల్లో అధికశాతం రోజుల్లో తుఫాన్ల ప్రభావంవల్ల కూడా అన్‌లోడింగ్, లోడింగ్‌కు తీవ్ర ఆలస్యమైంది. అన్‌లోడింగ్‌కు బార్జిలు వెళ్లినప్పటికీ అల్పపీడనంవల్ల సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో వెనుదిరిగి వచ్చాయి. అనేక రోజులపాటు వాతావరణం అనుకూలించకపోవడంవల్ల రేషన్‌బియ్యం అన్‌లోడింగ్‌కు ఇబ్బందులు పడ్డారు.

ఊపిరి పీల్చుకున్న అధికారులు

స్టెల్లా ఎల్ పనామా నౌక కాకినాడ తీరం నుంచి పశ్చిమాఫ్రికాకు వెళ్లడంతో కాకినాడ జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ప్రతిరోజూ నౌకలో రేషన్‌బియ్యం అన్‌లోడింగ్, తర్వాత లోడింగ్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పరిశీలన చేయాల్సి వచ్చేది. ఈ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అమరావతిలో ఉన్నతాధికారులకు చేరవేసేవారు. దీనిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిపెట్టి పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు నౌక వెళ్లిపోవడంతో హమ్మయ్య అనుకుంటున్నారు.

షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు.. సమయం మార్పుతో ప్రయాణికుల ఇబ్బంది

- సామర్లకోటలో సమయానికి చేరుకోలేకపోయిన 90మంది ప్రయాణికులు
- అధికారుల చొరవతో రాజమహేంద్రవరంలో మూడుగంటలపాటు నిలిపివేత

రాజమహేంద్రవరం సిటీ/సామర్లకోట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి షిరిడీ వెళ్లే సాయినగర్ ఎక్స్‌ప్రెస్ రైలు రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌లో మూడుగంటలపాటు నిలుపుదల చేశారు. వారంలో రెండు రోజులపాటు కాకినాడ నుంచి షిరిడీకి సాయినగర్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసు బయలుదేరుతుంది. ఈ రైలు గతంలో కాకినాడలో ఉదయం 6గంటలకు బయలుదేరేది. సామర్లకోట వచ్చేసరికి 6.15గంటలు అయ్యేది. కానీ, జనవరి 1నుంచి కొన్ని రైలు సర్వీసుల్లో సమయాల మార్పులు చేశారు. కాగా, సాయినగర్ రైలు సోమవారం ఉదయం 5:05గంటలకు కాకినాడ నుంచి బయలుదేరింది. 5.25గంటలకు సామర్లకోట చేరుకుని రాజమహేంద్రవరం వెళ్లిపోయింది. అంతకుముందు రిజర్వేషన్ చేసుకున్నవారికి టికెట్లలో పాత సమయమే ఉంది. దీంతో ప్రయాణికులు ఆ సమయానికి ఆలస్యంగా రైల్వేస్టేషన్లకు చేరుకున్నారు. ఇలా కాకినాడ రైల్వేస్టేషన్‌లో కొందరు, సామర్లకోట 95మంది ప్రయాణికులు ఉండిపోయారు. రైలు వెళ్లిపోయిందని తెలుసుకుని కాకినాడ, సామర్లకోట స్టేషన్లలో రైల్వే అధికారులను వారు నిలదీశారు. రిజర్వేషన్లు చేయించుకున్న ప్రయాణికులు రైల్వేస్టేషన్లలో ఉండిపోవడంతో రైల్వేఅధికారులు స్పందించి షిరిడీ ఎక్స్‌ప్రెస్‌ను రాజమహేంద్రవలో ఉదయం 6.15గంటలకు నిలపుదల చేశారు. వీరందరినీ కాకినాడ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు తరలించారు. దీంతో ఉదయం 9గంటల సమయంలో రెండున్నర గంటల ఆలస్యంగా సిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు తిరిగి బయలుదేరింది. దీంతో బాదిత ప్రయాణికులు ఊరట చెందారు.

వ్రత పురోహితులు సత్ప్రవర్తనతో మెలగాలి

- అన్నవరం ఈవో వీర్ల సుబ్బారావు

అన్నవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి ఆలయం పేరెత్తగానే గుర్తొచ్చేది సత్యనారాయణ స్వామి వ్రతమని వ్రతాలను నిర్వహించే పురోహితులు భక్తులపట్ల సత్ప్రవర్తనతో మెలిగి భక్తుల సందేహాలను విసుగు చెందకుండా నివృత్తి చేయాలని ఈవో వీర్ల సుబ్బారావు సూచించారు. సోమవారం ఆయన వ్రతపురోహిత సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. ఆదివారం దేవదాయ కమిషనర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో జరిగిన విషయాలను వారికి వెల్లడించారు. భక్తుల నుంచి ఆలయాలలో సమస్యలు, వారి అసంతృప్తి, తదితర అంశాలను ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ ద్వారా సేకరి స్తామని భక్తులను ఇబ్బందిపెట్టేలా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయకమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, వ్రతపురోహిత సూపర్‌వైజర్లు చామర్తి కన్నబాబు, మంథా శ్రీరామచంద్రమూర్తి, నాగాభట్ల రవిశర్మ పాల్గొన్నారు.


వ్రతపురోహిత సూపర్‌వైజర్లతో సమావేశమైన ఈవో సుబ్బారావు


ఆటో డ్రైవర్లు, యజమానులతో సమావేశమైన ఎస్.ఐ హరిబాబు, ఈఈ రామకృష్ణ

ప్రతి ఆటోడ్రైవర్‌కు తిలకధారణ ఉండాలి

- దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ

రైలు, రోడ్డుమార్గం ద్వారా సత్యదేవుడి ఆలయానికి విచ్చేసే భక్తులను కొండదిగువ నుంచి కొండపైకి చేరవేసే ఆటో డ్రైవర్లు, యజమానులు తప్పనిసరిగా దేవాలయ నిబంధనల మేరకు తిలకధారణ నామం ఉండాలని దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ పేర్కొన్నారు. దేవదాయ కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో సోమవారం రత్నగిరిపై వారితో సమావేశమయ్యారు. ఆటోలను ఉదయం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు అనుమతిస్తామన్నారు. ఆటోలో ముగ్గురు భక్తులను మాత్రమే తీసుకెళ్లాలని, ప్రతిఆటోకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండడంతో పాటుగా యూనిఫాం ధరించడం, డ్రైవర్ పేరు, వారి ఫోన్‌నెంబరు యాత్రికులకు కనిపించేవిధంగా రాంచడం, భక్తులపట్ల మర్యాదగా ప్రవర్తించడం ఆటోలో ఎవరైనా భక్తుడు లగేజీ మరిచిపోయినట్లైతే దేవస్థానం అధికారులకు అప్పగించి తద్వారా భక్తులకు చేరేవిధంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ హరిబాబు, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, తదితరులు పాల్గొన్నారు.



10న సత్యదేవుడి ఉత్తరద్వార దర్శనం

- ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 5 వరకు దర్శనభాగ్యం

అన్నవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని భక్తులకు ఈనెల 10న సత్యదేవుడి ఉత్తరద్వార దర్శనం కల్పించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఎప్పటిలాగానే ఒకే పర్యాయం మూలవరులను ఉత్తరద్వారంలో శ్రీ మహావిష్ణువు, లక్ష్మీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తరద్వార మార్గాన్ని వివిధ సుగంధభరిత పుష్పమాలికలతో అలంకరించనున్నారు. ఈఏడాది ఉత్తరద్వార దర్శన సమయాన్ని ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పెంచినట్లు ఈవో సుబ్బారావు తెలిపారు.

విజయదుర్గా పీఠంలో పూజలు

రాయవరం, జనవరి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గ పీఠంలో 10న వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పీఠంలో ఉన్న వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణతో భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. పీఠాధిపతి గాడ్ ప్రసంగిస్తారని తెలిపారు.

సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నడుపుతున్న సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాల విద్యార్థులు తమ పాండిత్యంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసాపత్రాలు పొందారు. హైదరాబాద్‌లో శ్రీ జనార్ధనానంద సరస్వతీ స్వామివారి ట్రస్ట్‌లో నిర్వహించిన ప్రవేశ, స్మార్తం, పంచదశకర్మల మౌఖిక పరీక్షలు నిర్వహించగా హాజరైన 21 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈసందర్భంగా ఆగమ పాఠశాల విద్యార్థులను ఈవో వీర్ల సుబ్బారావు అబినందించారు. కార్యక్రమంలో ఆగమ పాఠశాల అధ్యాపకులు ఆరా ద్యుల లక్ష్మీనరసింహమూర్తి ఏఈవో కొండలరావు ఉన్నారు.


స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న ఈవో సుబ్బారావు

'నన్నయ'లో ఫిబ్రవరి 5 నుంచి గిరిజన సాంస్కృతిక మహోత్సవం

దివాన్‌చెరువు, జనవరి 6: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో జాతీయస్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవం బ్రోచర్‌ను వీసీ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు జాతీయస్థాయిలో గిరిజన సాంస్కృతిక మహోత్సవాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ట్రైబుల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్పనాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, ప్రధాన కార్యదర్శి ముడవత్ విష్ణునాయక్, నిర్వాహకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.సుధాకర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, అసిస్టెంట్ ప్రొఫెసర్ వరహాలదొర, అధ్యాపకులు రంజిత్‌నాయక్, సేలం హనుమంతు, విశ్వవిద్యాలయ టీఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


జాతీయ గిరిజన సాంస్కృతిక మహోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరించిన వీసీ శ్రీనివాసరావు

అమెరికాలో ఉంటున్నా.. పుట్టిన ఊరు గురుతే!

- మురమండలో ఆలయాభివృద్ధికి రూ.20 లక్షల విరాళం
- ఎన్ఆర్ఐ వెంకట్రావు దాతృత్వం

కడియం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎక్కడున్నా.. ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన ఊరు.. కన్నతల్లిని మరువకూడదనేది మన పెద్దల మాట.. జిల్లాకు చెందిన ఒక ఎన్ఆర్ఐ అదే చేస్తున్నారు. పుట్టిన ఊరుకి తన వంతుగా సేవ చేస్తున్నారు. కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన ముద్దుల వెంకట్రావు ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. తాను పుట్టిన ఊరుకి ఏదో ఒకటి చేయాలనేది ఆయన ఆశ. ఈ మేరకు సుమారు రూ20 లక్షలుపైగా స్వీయ నిధులు ఇచ్చి గ్రామంలో సర్వకామదాంబ సోమేశ్వరస్వామి ఆలయంలో మండపం ఆధునీకరణ, గ్రానైట్, రంగులు, టైల్స్ వేయించాడు. అంతేకాకుండా పండితుల సలహా మేరకు సోమవారం దాత ముద్దుల వెంకట్రావు - సత్యదుర్గావాణి దంపతులు ముందుగా గణపతిపూజ, సర్వకామదాంబ సోమేశ్వరస్వామికి మహా త్రిపుర సుందరీ సమేత పంచ సహస్ర పార్థివలింగార్చన, అభిషేక హవన మహా రుద్ర కల్పం, శాంతి కల్యాణం చేశారు. ఈ పూజలో మట్టితో తయారు చేసిన 5 వేల శివలింగాలను ఉంచారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి శాంతి కల్యాణం, హోమంవైభవంగా జరిగాయి. అనంతరం ఆలయంవద్ద అన్నసమారాధన ఏర్పాటుచేశారు. పూజలో గ్రామస్తులతోపాటు భక్తులు పాల్గొన్నారు.


సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎన్ఆర్ఐ వెంకట్రావు, సత్యదుర్గావాణి దంపతులు

రాచపల్లిలో డ్రోన్‌తో స్ప్రేయింగ్‌పై అవగాహన సదస్సు

- 22 జిల్లాల బృందం పరిశీలన

ప్రత్తిపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ ద్వారా ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జీవామృతం పంటలపై పిచికారీ చేయడంపై కాకినాడజిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పంట పొలాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సామర్లకోట వ్యవసాయ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న 22 జిల్లాల శిక్షణా బృందం విచ్చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వైవీ గంగాదర్ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా జీవామృతాలు పిచికారీ చేయడంవల్ల రైతు శ్రమ తగ్గడమే కాకుండా డబ్బులు, సమయం ఆదా అవుతుందన్నారు. ఈ సమావేశంలో స్టేట్ టిమేటిక్ లీడ్ జానకి, బుజ్జిబాబు, జిల్లా ఆర్డినేటర్ గణేష్, ఎంపీఎల్ఎంఎస్‌ఏలు, ప్రత్తిపాడు డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొని రైతులు పలు అంశాలు వివరించారు. వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్రస్థాయి ఎస్ఎంపీ షాప్ యజమానుల శిక్షణా కార్యక్రమంలో ఈ సదస్సు నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేత

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5లక్షల చెక్కులను కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ సోమవారం అందజేశారు. ఈనెల 4వతేదీన రాజమండ్రిలో జరిగిన గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా రంగంపేటవద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాకినాడ రూరల్ గైగోలుపాడుకు చెందిన మణికంఠ, అశోక్‌నగర్‌కు చెందిన చరణ్‌ల కుటుంబ సభ్యులకు ఆయన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేనపార్టీ తరఫున ఈ చెక్కులను అందజేశామన్నారు. బాధిత కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటా మన్నారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు.


బాధితులకు చెక్కులు అందిస్తున్న కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

జాతీయ విద్యావిధానం వద్దు

- కాకినాడ యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో వ్యతిరేకించిన మేధావులు, విద్యావేత్తలు
- ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ధ్వజం




సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎంపీ బేబీ, విద్యావేత్త బాల సుబ్రహ్మణ్యం

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో జాతీయ విద్యా విధానం 2020 విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తుందని యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో మేధావులు, విద్యావేత్తలు వ్యతిరేకించారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహా సభల్లో రెండోరోజు సోమవారం జరిగిన విద్యా సదస్సుకు యూటీఎఫ్ అసోసియేట్ సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. సదస్సులో ప్రముఖ విద్యావేత్త, మాజీ ఫ్లోర్ లీడర్ వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 వల్ల దేశంలో విద్యాభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి సీఎన్.భారతి మాట్లాడుతూ దేశంలో విద్య పూర్తిగా వ్యాపారం అయిపోందన్నారు. ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యా యులు సామాజికం, ఆర్థికంగా ఉన్నతంగా ఉన్నప్పుడే మంచి బోధన జరుగుతుందన్నారు. ఏపీఎన్‌జీవో అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్ మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. ఏపీఎన్‌జీవో నాయకుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల ప్రభుత్వ పాఠశాల విద్య ధ్వంసమైందని, అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయన్నారు. ప్రభుత్వం తక్షణమే జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, గోపిమూర్తి, ఇళ్ల వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.నగేష్, చక్రవర్తి, రాష్ట్రకార్యదర్శులు మోహన్‌రావు, కిషోర్, మనోహర్, లక్ష్మీరాజ్యం, జ్యోతిబసు పాల్గొన్నారు.




వేదికపై అతిథులకు జ్ఞాపికలు, మాట్లాడుతున్న ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు శివారెడ్డి

మహిళా సాహిత్య సదస్సు

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో సోమవారం ప్రత్యేకంగా మహిళా సాహిత్య సదస్సు జరిగింది. ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడు కుమార్‌రాజా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావ్లే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. మార్కెట్ ప్రభావం నుంచి నేటి తరం బాలలను రక్షించుకోవాలన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ అమ్మ, ఏడుతరాలు,స్పార్టకస్ వంటి నవలలను ఉపాధ్యాయినులు చదవాలన్నారు. తద్వారా ఉపాధ్యాయులతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ చేతులు జోడించడం ద్వారా కాకుండా చేతులు బిగించడం ద్వారా అభివృద్ధి చెందు తామన్నారు. సాహిత్యం మనుషులను సంస్కరిస్తుం దన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ సాహిత్యం మరో నవ సమాజాన్ని నిర్మిస్తుందన్నారు. అనంతరం అట్టాడ అప్పలనాయుడు రచించిన నక్షత్రబాట, కే.మోహన రచించిన చెమట చెక్కిన వాక్యం పుస్తకాలను ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐ.ప్రసాద్‌రావు, చిలుకూరు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావులు వందన సమర్పన చేశారు.

ఎరుపెక్కిన కాకినాడ!

వేలాది మంది యూటీఎఫ్ ఉపాధ్యాయుల ర్యాలీ

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కాకినాడలో యూటీఎఫ్ ఉపాధ్యాయులు వేలాది మంది ర్యాలీ చేశారు. యూటీఎఫ్ జెండాలను పట్టుకుని ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందామని నినాదాలు చేశారు. ర్యాలీ కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు మీదుగా జగన్నాథపురం బ్రిడ్జి మీదుగా బాలాజీ చెరువు సెంటర్ వరకు సాగింది. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్‌ల సారథ్యంలో ఈ ర్యాలీ విజయవంతంగా సాగింది. దీంతో కాకినాడ ఎరుపెక్కింది. దేశం నలు మూలల నుంచి వచ్చిన విద్యా వేత్తలు, మేధావులు, ఉపాధ్యాయులతో కిటకిటలాడింది. ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏలు, మెడికల్ లీవులు చెల్లించాలని నినాదాలు చేశారు. సరెండర్ లీవులు, పీఆర్సీ చెల్లించాలని డిమాండ్ చేశారు. 117 జీవోను రద్దు చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు చేయాలని, ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందామని నినాదాలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. భారీజెండాలు, డప్పులు వాయి ద్యాలతో కాకినాడ నగరం మారుమోగింది. అలాగే ఉద్యమ గీతాలు ఆలపించారు.

ర్యాలీకి ముందు వేదికపై ఉత్సాహంగా ఉపాధ్యాయులు





ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గుడ్డు ధమాల్!

- పడిపోయిన గుడ్డు ధర
- హోల్‌సేల్‌లో రూ.6.30 నుంచి రూ.4.50కు తగ్గిపోయిన వైనం
- మార్కెట్‌లో రూ.6 నుంచి రూ.7వరకు విక్రయం
- ఆవేదనలో కోళ్ల పరిశ్రమల నిర్వాహకులు



మండపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నిలకడలేని కోడి గుడ్డు ధరతో రైతులు డీలా పడుతున్నారు. ముఖ్యంగా గతేడాది నవంబరు, డిసెంబరులో గుడ్డు ధర ఆశాజనకంగా రూ.6.30పైసలకు చేరింది. ధర పెరిగిందన్న ఆనందం రైతుల్లో ఎంతోకాలం నిలవలేదు. కారణం గుడ్డు ధర అమాంతంగా పడిపోవడమే. ప్రస్తుతం గుడ్డు ధర మార్కెట్‌లో నూతన సవంత్సరం ప్రారంభంలోనే పడిపోయింది. ఇప్పుడు హోల్ సేల్ ధర రూ.4.75కి పడిపోయింది. విడిగా గడ్డు ధర మార్కెట్‌లో రూ.6నుంచి రూ.7వరకు విక్రయిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కోళ్ల పరిశ్రమ నిర్వాహణ భారంగా మారి మూతపడే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చే స్తు న్నా రు. పెరిగిన ధర 5 నెలలపాటు నిలబడితే పరిశ్రమకు ఉపశమనం కలుగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. కోళ్ల మేతకు వినియోగించే ముడి సరుకు కొరత కూడా తీవ్రంగా ఉండడం తోపాటు వాటి ధర పెరగడంతో మోయలేని భారం పడుతుందని వాపోతున్నారు. ప్రస్తుతం శీతకాలంలో 3 నెలల పాటు గుడ్డు ధర నిలకడగా ఉంటుందని అనుకున్న కోళ్ల రైతులు ఆశలపై నూతన సవంత్సర ప్రారంభంలోనే నీళ్లు పడ్డాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 200వరకు కోళ్ల ఫారాలు ఉన్నాయి. వాటిలో 1.3కోట్ల మేర కోళ్లు ఉండగా వాటి నుంచి 1.10 కోట్లమేర గుడ్లు ఉత్పత్తవుతున్నాయి. 60శాతం గుడ్లు మేర పొరుగు రాష్ట్రాలకు ఎగుమతులు అవుతుండగా ఇక్కడ ప్రజలకు 40 శాతం మేర సరఫరా చేస్తున్నారు. నవంబరు నుంచి ఫిబ్రవరి వరకు గుడ్డు ధర నిలకడగా ఉంటే కోళ్ల రైతులు నష్టాల బారి నుంచి కొంతమేర గట్టెక్కేవారు. కానీ ఇప్పుడు గుడ్డు ధర నిలకడగా లేకపోవటం వల్ల నష్టాలు తప్పవని కోళ్ల పరిశ్రమల నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుత కోళ్లపరిశ్రమ పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈశాన్యరాష్ట్రాల్లో కోళ్ల పరిశ్రమలు పెరగడం కూడా ఇక్కడ రైతులపై ప్రభావం చూపిస్తుందని వారు చెబుతున్నారు.

ఏపీ పేపరుమిల్లు లాకౌట్...ఎత్తివేత

- వేతనం పెంచాలని కార్మికుల డిమాండ్
- గత ఐదు రోజులుగా సమ్మె
- సోమవారం లాకౌట్ ప్రకటన
- రోడ్డెక్కిన 2 వేల మంది కార్మికులు
- ఫ్యాక్టరీ ఎదుట ఉద్రిక్తత
- లాకౌట్ ఎత్తివేయాలని కార్మికసంఘాల డిమాండ్
- దిగివచ్చిన యాజమాన్యం
- లాకౌట్ ఎత్తివేత ప్రకటన



పేపరుమిల్లు గేటు ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరు మిల్లును మూసి వేశారు. నూతన వేతన ఒప్పందం చేయాలని ఆంధ్రప్రదేశ్ పేపరు మిల్లు కార్మికులు చేపట్టిన సమ్మెతో మిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. మిల్లు కార్మికులు గత కొద్ది నెలలుగా నూతన వేతన ఒప్పందం కోసం నిరసనలు చేపట్టిన సంగతి విదితమే. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెండు దఫాలుగా యాజమాన్య ప్రతినిధులు, కార్మిక యూనియన్లతో ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ప్రశాంతి సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో కార్మికుల డిమాండ్‌ను యాజమాన్యం అంగీకరించలేదు. మిల్లులో రెగ్యులర్ కార్మికులు సుమారు 800మంది, కాంట్రాక్టు కార్మికులు 2 వేల మంది పనిచేస్తున్నారు. నూతనంగా కార్మికుడికి రూ.10,500లు పెంచుతూ వేతన ఒప్పందం చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. మిల్లు యాజమాన్యం రూ.3500 పెంచుతామని తెలియజేసింది. దీనికి కార్మికులు నిరాకరించారు. మిల్లు రూ.1200 కోట్ల లాభాల్లో ఉండగా కార్మికుల వేతనాలు పెంచడంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని కార్మిక సంఘాలు మండిపడ్డాయి. ఈ మేరకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు అమరావతిలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శితో సమావేశం నిర్వహించి కార్మికులకు న్యాయం చేయాలని, అందుకు ఒక కమిటీని వేయాలని ఆదేశించడం జరిగింది. ఈ మేరకు మిల్లులో గత ఐదు రోజులుగా సమ్మెలో ఉన్న కార్మికులకు ఆదివారం ప్రజాప్రతినిధులు మద్దతు ప్రకటించి విషయాన్ని తెలిపారు. గత కొద్ది నెలలుగా చేస్తున్న ఆందోళన కార్మికులు విరమించాలని.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పివెళ్లారు. అయినా కార్మికులు దిగిరాలేదు. దీంతో యాజమాన్య మొండి వైఖరి ప్రదర్శించింది. తెలారేసరికి అనుహ్యంగా పేపరుమిల్లు యాజమాన్యం మెయిన్ గేటుకు లాకౌట్ నోటీసులను అంటించి మిల్లును క్లోజ్ చేసింది. దీనిపై విస్మయం చెందిన కార్మికులు సోమవారం ఉదయం 6 గంటల నుంచే మిల్లు వద్ద ఆందోళనకు దిగారు. అగ్రిమెంట్ చేయమంటే దానిని చేయకుండా లాకౌట్ ప్రకటించిన యాజమాన్య వైఖరిని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. కార్మికులంతా రోడ్డెక్కడంతో పేపరుమిల్లు -సీతంపేట రోడ్డు కార్మికులతో బ్లాక్ అయ్యింది. సంఘటనా స్థలానికి భారీగా పోలీసులు చేరుకున్నారు. కార్మికుల ఆందోళన కొనసాగుతుంది. పేపరు మిల్లు కార్మికులకు అండగా కార్మిక సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు నిలిచారు. కార్మికుల ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. కార్మికులకు రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రిఘాకోళ్ళ శిరామసుబ్రహ్మణ్యం, సీఐటీయూ, ఏఐటీ యూసీ నేతలు అరుణ్, కె.రాంబాబు మద్దతు తెలిపారు.

"పేపరుమిల్లు యాజమాన్యం దిగిరాకపోతే సహించేదిలేదు. 2రోజుల్లో యాజమాన్యం నుంచి సానుకూల ప్రకటన రాకపోతే ఉద్య మాన్ని ఉధృతం చేస్తాం" అని రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హెచ్చరించారు.

కూటమి ఎమ్మెల్యేల చొరవతో సమ్మె విరమించిన 9 యూనియన్లు

లాకౌట్ ఎత్తివేసేందుకు అంగీకరించిన పేపరుమిల్లు యాజమాన్యం


ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులు వేతన ఒప్పందం కోసం చేపట్టిన సమ్మెను 9 యూనియన్లు విరమించుకున్నాయి. కూటమి ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణల చొరవతో సోమవారం రాత్రి పరిశ్రమల శాఖ అధికారులను తీసుకుని కార్మిక సంఘాలు, మిల్లు యాజమాన్య ప్రతినిధులతో సుమారు గంటపాటు చర్చించారు. దీంతో 9 యూనియన్లు సమ్మెను విరమించేందుకు అంగీకారం తెలిపాయి. వెంటనే మిల్లు యాజమాన్యం కూడా లాకౌట్‌ను ఎత్తివేసేందుకు అంగీకరించింది. దీంతో పేపరుమిల్లు కార్మికులు మంగళవారం ఉదయం నుంచి విధులకు హాజరుకాబోతున్నారు. అయితే మొత్తం 11 యూ నియన్లకు 9 యూనియన్లు సమ్మెను విరమించేందుకు అంగీకరించగా రెండు యూనియన్లు వ్యతిరేకించాయి. అయితే మిగిలిన ఆ రెండు యూనియన్ల వైఖరి మంగళవారం స్పష్టం కానుంది.

హెచ్ఎంపీవీ వైరస్ కట్టడికి ముందస్తు చర్యలు

కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గతంలో కరోనా వైరస్‌తో కుదేలైన కుటుంబాలన్ని హమ్మయ్య అని పీడకల లాంటి జ్ఞాపకాల నుంచి తేరుకుంటున్న వేళలో మళ్లీ చైనాలోనే పుట్టి అక్కడి నుంచి వ్యాప్తి చెందుతున్న హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) తక్కువ ప్రమాదకర మైనప్పటికీ వేగంగా వ్యాప్తి చెంది ఎక్కువ మందికి సోకే అవకాశం ఉన్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కాకినాడ జీజీహెచ్ (బోధనాసుపత్రి) లోని ఈఎన్‌టి విభాగంలో 22 పడకల సామర్థ్యం కలిగిన ప్రత్యేక వార్డును మంగళవారం ఏర్పాటు చేయనున్నట్టు ఆసుపత్రి సూపరిండెంట్ డా.ఎస్.లావణ్యకుమారి తెలిపారు. అయితే ఎప్పటికప్పుడు సబ్బుతో చేతులు కడుక్కోవడం, మాస్క్ ధరించడం, శానిటైజర్ వాడుతూ ముందస్తు స్వీయ పరిరక్షణ చర్యలు చేపడితే వైరస్ దరిచేరదని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీ మృతి



శ్రీరామమూర్తి (ఫైల్)

ముమ్మిడివరం/అయినవిల్లి జనవరి 6(ఆంధ్రజ్యోతి):మోటారుసైకిల్‌పై వెళ్తున్న ఎంపీటీసీ అదుపుతప్పి బోల్తా కొట్టిన సంఘటనలో మృతిచెందారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లా అయినవిల్లి మండలం క్రాప-శంకరాయగూడం ఎంపీటీసీ గుత్తుల శ్రీరామమూర్తి (68) సోమవారం ఇంటి నుంచి ముమ్మిడివరం వెళ్తుండగా మాగాం-అయినాపురం పంటకాల్వ గట్టు రోడ్డులో క్రాప చింతలపూడి సమీపంలో మోటారు సైకిల్ అదుపుతప్పి పక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీరామమూర్తి భార్య సత్యవేణి గతంలో మృతిచెందగా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. శ్రీరామమూర్తి గతంలో క్రాప-శంకరాయగూడెం సర్పంచ్‌గా పనిచేశారు. శ్రీరామమూర్తి మృతికి వివిధ పార్టీలకు చెందిన పలువురు సంతాపాన్ని వ్యక్తం చేశారు. శ్రీరామమూర్తి పార్థీవదేహానికి నాగవిజయలక్ష్మి, కుడుపూడి విద్యాసాగర్, మట్టపర్తి రామారావు, పెచ్చెట్టి రాంబాబు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వివాహితకు ఏపీఎస్పీ కానిస్టేబుల్ వేధింపులు

చర్యలు తీసుకోవాలంటూ పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా



సర్పవరంలో ధర్నా చేస్తున్న వివాహిత, బంధువులు

సర్పవరం జంక్షన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీ కానిస్టేబుల్ చనిబోయిన లోవరాజుపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రాత్రి సర్పవరం పోలీస్‌స్టేషన్ వద్ద వివాహిత భర్త, బంధువులతో కలసి ధర్నా నిర్వహించారు. 3వ డివిజన్ గొడారిగుంటకు చెందిన యడాల సురేష్, దుర్గాశ్రావణి భార్యభర్తలు. సురేష్‌కు మావయ్య అయిన ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న చనిబోయిన లోవరాజు పక్క పోర్షన్‌లో నివాసం ఉంటున్నాడు. భర్త ఇంటిలో లేని సమయంలో అసభ్యంగా చేతులు వేస్తూ డబ్బులిస్తా కోరిక తీర్చాలని వేధిస్తున్నాడని కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాత్రి సర్పవరం పోలీస్‌స్టేషన్ వద్ద దుర్గాశ్రావణి ధర్నా చేపట్టింది. ట్రాఫిక్ స్తంభించడంతో సర్పవరం సీఐ బి పెద్దిరాజు, ఎస్ఐ ఏసుబాబు ఆందోళనకారులకు నచ్చచెప్పారు. కానిస్టేబుల్ లోవరాజుపై విచారణ చేపడుతున్నామని, ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తామని హామీఇచ్చి ఆందోళన విరమింపజేశారు. తనపై వేధింపులకు పాల్పడుతున్న కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని డిసెంబరు 31 రాత్రి ఫిర్యాదు చేసినా పోలీసులు ఎందుకు పట్టించుకోలేదని దుర్గాశ్రావణి, భర్త సురేష్ ప్రశ్నించారు. కానిస్టేబుల్ కావడంతో లోవరాజుని వెనకేసుకు వస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. వివాహిత ఫిర్యాదు మేరకు జనవరి 3న రసీదు ఇవ్వడం జరిగిందని, సోమవారం కానిస్టేబుల్ లోవరాజుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు సీఐ పెద్దిరాజు తెలిపారు. దర్యాప్తు పూర్తి చేసి ఆరోపణలు వాస్తవమని తేలితే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పెద్దాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం నుంచి వాలుతిమ్మాపురం వెళ్లే రహదారిలో లలిత రైస్ ఇండస్ట్రీస్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సామర్లకోట గణపతి నగరానికి చెందిన పెంకే అప్పారావు (65) బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ అదుపుతప్పి అతడిని ఢీకొనడంతో అప్పారావు అక్కడిక్కడే మృతిచెందాడు. అప్పారావు స్థానికంగా ఉన్న ఓ రైస్‌మిల్లులో పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

రొయ్యల చెరువులో పడి వ్యక్తి మృతి

కరప, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కరపమండలం సిరిపురంలోని రొయ్యల చెరువులో పడి ఒక వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ తోట సునీత తెలిపిన సమాచారం మేరకు... కరపమండలం జి.బావారం గ్రామానికి చెందిన అయితఅప్పల ప్రభాకర ఆనందబాబు(59) సిరిపురంలో జనసేన నేత చిక్కాల దొరబాబుకు చెందిన రొయ్యల చెరువుల వద్ద పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం అతడు రొయ్యలకు మేత వేస్తూ ప్రమాదవశాత్తు ఫైబర్ బోటు నుంచి చెరువులో పడి మునిగిపోయాడు. అది చూసి పక్క చెరువులో పనిచేస్తున్న బోడపాటి దుర్గాప్రసాద్, ఊబా బుల్లిరాజులు చెరువులో దిగి ఆనందబాబును బయటకు తీసేసరికి అప్పటికే మృతిచెందాడు. ఘటనా స్థలికి చేరుకున్న కరప పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి కుమారుడు సాగర్ ఇచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేశారు.

మధ్యవర్తిత్వంతో త్వరితగతిన ప్రయోజనం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

రాజమహేంద్రవరంలో మధ్యవర్తిత్వ తర్ఫీదు కార్యక్రమం ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా సమయం వృథా కాదని, త్వరితగతిన ప్రయోజనం సమకూరుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థలో గంధం సునీత ఆధ్వర్యంలో 5 రోజుల పాటు జరిగే మధ్యవర్తిత్వ తర్ఫీదు కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ దీని వల్ల సామరస్యపూర్వకంగా కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ గాయత్రి దేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్‌బాబు, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన 24 మంది అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ న్యాయమూర్తులు ఉన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ ప్రభాకరరావు మృతి



ప్రభాకరరావు (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ సీనియర్ జర్నలిస్ట్ జ్యోతుల ప్రభాకరరావు (62) సోమవారం మృతిచెందారు. లాలాచెరువులో నివాసం ఉంటున్న ఆయన ప్రస్తుతం ఒక ప్రధాన దినపత్రికలో సీనియర్ సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. తిలక్‌రోడ్డులోని వీఎల్‌పురం మలుపు వద్ద ఆదివారం సాయంత్రం ఒక యువకుడు ఆయన బైక్‌ను స్కూటీతో వేగంగా ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్రగాయాలపాలై ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన ఆయన కొద్దిసేపటికే కోమాలోకి వెళ్లిపోయారు. సోమవారం సాయంత్రం పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. 4 దశాబ్దాల పాటు పాత్రికేయుడిగా పలు పత్రికల్లో సేవలందించారు. ఆయన మృతి పట్ల ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి మండేల శ్రీరామ్మూర్తి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, పలువురు పాత్రికేయులు సంతాపం ప్రకటించారు. ప్రభాకరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

కాకినాడ క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆరో రోజైన సోమవారం కూడా కొనసాగాయి. మొత్తం 351 మంది పురుష అభ్యర్థులు హాజరు కాగా తదుపరి పరీక్షకు 278 మంది అర్హత సాధించారు. పరీక్షలను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ స్వయంగా పర్యవేక్షించారు.



లాంగ్ జంప్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

దివ్యాంగ పింఛను అర్హతలపై వైద్యుల తనిఖీ



అనపర్తిలో బెడ్ రెస్టెడ్ పింఛన్‌దారుల అర్హతలను తనిఖీ చేస్తున్న వైద్యులు

అనపర్తి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అర్హత లేకపోయినా దివ్యాంగ పింఛను పొందుతున్న వారిని తొలగించి అర్హులను గుర్తించేందుకు గుర్తించేందుకు ఏర్పాటు చేసిన వైద్యుల బృందం సోమవారం లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి తనిఖీలు నిర్వహించింది. మండలంలో బెడ్ రెస్టెడ్ పేషెంట్లుగా ఉన్న 15మందికి ప్రభుత్వం నెలకు రూ.15 వేల పింఛను అందజేస్తోంది. అయితే వీరిలో కూడా అనర్హులు ఉన్నారని భావించిన ప్రభుత్వం తనిఖీ వైద్యుల బృందాలను ఏర్పాటు చేసింది. దీంతో వారు వివిధ గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లారు. వారికి అక్కడికక్కడే పలు పరీక్షలు నిర్వహించి వివరాలను నమోదు చేసుకున్నారు. బృందంలో డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ లక్ష్మీప్రవీణ, రామవరం పీహెచ్‌సీ వైద్యాధికారి సుమతి, కుమారి, సునీత, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు



మొక్కజొన్న సాగుపై రైతులకు సూచనలిస్తున్న దృశ్యం

గోకవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సాగులో రైతులు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పెద్దాపురం మొక్కజొన్న పరిశోధనా కేంద్ర అధికారి హఫీజాపర్వీన్ చెప్పారు. మండలంలోని గోపాలపురంలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమ, పయనీర్ మొక్కజొన్న విత్తనాల కంపెనీ, కోర్టివా రసాయనాల కంపెనీలు సంయుక్తంగా మొక్కజొన్న ఉత్పత్తిని పెంచే ఉద్దేశంతో రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మొక్కజొన్న సాగుపై పాటించవలసిన జాగ్రత్తలను, మెళకువలను హఫీ జాపర్వీన్ రైతులకు తెలియజేశారు. అనంతరం ఉచితంగా మొక్కజొన్న విత్తనాలు, రసాయనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల నిర్వాహకులు వివేక్, నాగేంద్రబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పెంచిన కరెంట్ ఛార్జీలు తగ్గించాలని, సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని తదితర డిమాండ్లతో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఏఐకేఎంఎస్ నాయకుడు వి.భీమశంకర్, ఐఎఫ్‌టీయూ నాయకుడు రాజారెడ్డి, భాను ప్రసాద్, దినేష్, ధర్నేష్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కాకినాడ-సామర్లకోట బస్సు రూటు మార్పు

ఈ నెల 11 వరకు కాకినాడ నుంచి సామర్లకోట రోడ్డు మరమ్మతులు

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 6(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్‌అండ్‌బీ డిపార్టుమెంట్ వారి ఆదేశాల మేరకు ఈనెల 6వ తేదీ నుంచి 11 వరకు కాకినాడ నుంచి సామర్లకోట రోడ్డు మరమ్మతుల నిమిత్తం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రాకపోకలకు అనుమతిలేని కారణంగా ఆ సమయంలో బస్సులు కింది తెలిపిన విధంగా రూటు మార్పు చేసినట్టు జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. సామర్లకోట నుంచి కాకినాడ వచ్చేప్పుడు, కాకినాడ నుంచి సామర్లకోట వెళ్లేప్పుడు ముత్యాలమ్మ గుడి ఏడీబీ రోడ్డు, కొప్పవరం జంక్షన్, పనసపాడు, సర్పవరం, సర్పవరం జంక్షన్ మీదుగా కాకినాడ బస్టాండ్‌కు వస్తుందన్నారు. కాకినాడ రాజమహేంద్రవరం నాన్‌స్టాప్‌లు జీజీహెచ్ కౌంటర్ వద్దకు వెళ్లకుండా బస్టాండ్ నుంచి సర్పవరం జంక్షన్, సర్పవరం గ్రామం, పనసపాడు, కొప్పవరం జంక్షన్ మీదుగా ఏడీబీ రోడ్డు మీదుగా రాజమహేంద్రవరం వెళ్తుందన్నారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాక యథావిధిగా బస్సులు పాత రూట్‌లో తిరుగుతాయని పేర్కొన్నారు.

మార్గదర్శి ఏసీవై రెడ్డి

విగ్రహావిష్కరణలో మంత్రి కందుల దుర్గేష్



ఏసీవై రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకులకు మార్గదర్శి మాజీ ఎమ్మెల్యే ఏసీవై.రెడ్డి అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. జెండా పంజారోడ్డులోని మద్దూరి అన్నపూర్ణయ్య పార్కులో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఏసీవై.రెడ్డి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. నాడు కాంగ్రెస్ పార్టీలో రాజకీయ భవిష్యత్‌కు పునాది వేసింది ఏసీవై.రెడ్డి అని చెప్పారు.ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రాజకీయాలకు ఏసీవై.రెడ్డి ఆద్యుడన్నారు. రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ నాడు కందుల దుర్గేష్ బాలచంద్రుడుగా రంగస్థలంపై నటించి మెప్పించారని.. అంతకు మునుపు సినీ నిర్మాతగా మారి సినీరంగ విషయాలు గ్రహించారని.. ఆ రెండు విభాగాలు కలిపి సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖ ఆయనకు రావడం యాదృచ్ఛికమే అయినా, అది ఒక విశేషమని గుర్తు చేశారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రాజకీయాల్లో ఏసీవై.రెడ్డిని మించిన రాజకీయ వేత్త మరొకరు ఉండరన్నారు. ఏసీవై.రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన మద్దూరి అన్నపూర్ణయ్య సేవా సమితి సారథులు రౌతు సూర్యప్రకాశరావు, బెజవాడ రంగారావులను అభినందించారు. సీనియర్ జర్నలిస్ట్ కృష్ణకుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఏసీవై.రెడ్డి కుటుంబీకులు అంగిటపల్లి సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గన్ని కృష్ణ, టీకే విశ్వేశ్వరరెడ్డి, ఆకుల వీర్రాజు, డాక్టర్ అనసూరి పద్మలత, రెడ్డి రాజు, పంతం కొండలరావు, పోలసానపల్లి హనుమంతరావు, మేడపాటి షర్మిళారెడ్డి, పోలు విజయలక్ష్మి, అశోక్‌కుమార్ జైన్ పాల్గొన్నారు.

ఎరువుల వర్తకుల సంఘం
గోకవరం అధ్యక్షుడిగా సత్తిబాబు

గోకవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వర్తకుల సంఘం మండలాధ్యక్షుడిగా గోకవరానికి చెందిన బత్తుల సత్తిబాబు ఎంపికయ్యారు. వర్తకుల సంఘం సభ్యులు సత్తిబాబు స్వగృహంలో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సత్తిబాబును అధ్యక్షుడిగా సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

9న జిల్లా అభివృద్ధి సమన్వయ
పర్యవేక్షణ కమిటీ సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈనెల 9న మధ్యాహ్నం 3గంటలకు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నామని దీనికి జిల్లా అధికారులంతా వారి వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌లో
19 అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు రహదారులు, డ్రైనేజీల నిర్మాణాల కోసం అర్జీలు పెట్టుకున్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 19 అర్జీలను కమిషనర్ కేతన్ గార్గ్ స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి నాణ్యతతో కూడిన పరిష్కారాలు చూపించాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ఇందిరసత్యనగర్‌లో ఆక్రమణలు తొలగించి సీసీ రోడ్లు నిర్మించాలని వాసవి కోరారు. కార్పొరేషన్ నుంచి తనకు రావాల్సిన బిల్లులను చెల్లించాలని రావులపాలేనికి చెందిన డి.సురేంద్రరెడ్డి అనే కాంట్రాక్టరు అర్జీపెట్టుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

'గౌతమి' క్రీడాకారిణులకు
టీటీలో సిల్వర్ మెడల్

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీకి చెందిన యండమూరి సూర్య, చార్విఫల్ ఇటీవల చెన్నై అమిత్ యూనివర్సిటీలో జరిగిన సౌత్‌జోన్ టెన్నిస్ యూనివర్సిటీ గేమ్స్‌లో జైన్ యూనివర్శిటీ తరపున పాల్గొని సిల్వర్ మెడల్ సాధించారు. వీరు త్వరలో జరిగే ఆలిండియా యూనివర్సిటీ గేమ్స్, ఖేలో ఇండియా గేమ్స్ అర్హత సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులను ఏపీటీడీఏ అధ్యక్షుడు విశ్వనాథం భాస్కరరాం, జిల్లా అధ్యక్షుడు అప్పారెడ్డి, ట్రెజరర్ సత్యనారాయణ, కోచ్ వీటీటీ సుబ్బారావు, పి.వేణుగోపాల్ అభినందించారు.

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

వెహికల్ యార్డు పరిశీలనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



వెహికల్ యార్డ్ పరిశీలనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. క్వారీ ప్రాంతంలోని చెత్త సేకరణ వాహనాలు నిలుపుదల చేసే వెహికల్ యార్డును సోమవారం ఆయన పరిశీలించారు. చెత్త తరలించేందుకు ఎన్ని వాహనాలు ఉన్నాయి, ఎన్ని కండిషన్‌లో ఉన్నాయని ఆరాతీశారు. చెత్త తరలించే వాహనాలను పెట్టిన కాంట్రాక్టర్ గతంలో వాహనాలను విజయవాడ తరలించారని ప్రస్తుతం ఉన్న వాహనాలతోనే నగరంలో నిత్యం చెత్త తరలింపు జరుగుతుందని ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న వివరించారు. అనంతరం బయట ఫీల్డ్‌లో వాహనాల ద్వారా చెత్త తరలింపు ప్రక్రియ పరిశీలించారు.ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనాల విషయంలో కాంట్రాక్టరు కావాలనే చేస్తున్నట్టు అనిపిస్తుందన్నారు. నగరంలో చెత్త తరలించేందుకు 20 వాహనాలను స్టాండ్‌బై పెట్టుకోవాలని దీనిపై కమిషనర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా సంక్రాతి రంగవల్లుల పోటీలు

రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు అత్యంత ఘనంగా జరుతున్నాయి. సోమవారం నగరంలో 45,46,47,48,49, డివిజన్లలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కోడి పుంజుతో సందడి చేసి భోగిమంటలు వేరు. ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అందమైన రంగవల్లులు వేసారు. మహిళలకు బహుమతులను ఎమ్మెల్యే వాసు అందించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఈనెల 11న పుష్కరాలరేవు వద్ద జరిగే సంక్రాంతి సంబరాల్లో ప్రదానం చేస్తామని ఆయన చెప్పారు.

బీసీ సంఘం యువజన విభాగం
రాష్ట్రాధ్యక్షుడిగా మల్లేష్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం యువ జన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా రాజమహేంద్రవరానికి చెందిన లద్దిక మల్లేష్‌ను నియమించారు. స్థానిక ఈట్ అండ్ ప్లే కన్వెన్షన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు యలాగుల నూకాలమ్మ మాట్లాడారు. బీసీల 50శాతం రిజర్వేషన్లకు ఆర్.కృష్ణయ్య అలుపెరుగని పోరాటం చేస్తున్నారని గుర్తుచేశారు. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అనంతరం బీసీ సంఘం యువ జన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా లద్దిక మల్లేష్, బీసీ సంక్షేమ సం ఘం రాష్ట్ర కన్వీనర్‌గా చొల్లంగి వేణుగోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దాలిపర్తి వేమన, బత్తుల నాగేశ్వరరావు, రూరల్ యువ జన అధ్యక్షుడిగా కన్నాబత్తుల ఆనందరావులకు నియామకపత్రాలు అందించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణరాజు, వీవీఎస్.కృష్ణారావు, వాసంశెట్టి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు



నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

నిందితులకు రిమాండ్

సీతానగరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం రాజంపేట గ్రామంలో డిసెంబర్ 31న జరిగిన ఘర్షణలో ఇద్దరిని గాయపర్చి, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో ఐదుగురు నిందితులకు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ డి.రామ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఈ కేసులో మునికూడలికి చెందిన కప్పల జయసూర్య, మురళి అనిల్ దేవ, రాచపల్లి నారాయణ మూర్తి, మార్పు ప్రేమ్ కుమార్, జాలిమూడికి చెంది కర్ర చందులను సోమవారం ఉదయం అరెస్ట్ చేశామన్నారు. నిందితులను రాజమహేంద్రవరం 7వ అదనపు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

రేబిస్ సోకిన విద్యార్థి
చికిత్స పొందుతూ మృతి

సీతానగరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రఘుదేవపురం గ్రామానికి చెందిన కాండ్రు హసన్(17)కు ర్యాబిస్ సోకడంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు హెడ్ కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు..రఘుదేవపురం గ్రామానికి చెందిన హసన్ కాతేరు వద్ద ఒక కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. ర్యాబిస్ లక్షణాలతో బాధపడుతుండగా ఆదివారం అర్ధరాత్రి రఘుదేవపురం నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ప్రత్యేక వార్డులో చికిత్స అందించారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. నాలుగు నెలల క్రితం తన కుమారుడిని కుక్క కరవడంతో ర్యాబిస్ సోకిందని తండ్రి కాశీ విశ్వనాథ్ ఫిర్యాదు ఇచ్చారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు

పరశురామ అవతారంలో
శ్రీభజేనారాయణుడు

రంగంపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వడిశలేరు గ్రామంలోనున్న శ్రీభజేనారాయణస్వామి ఆలయంలో దశావతార ఉత్సవాల్లో భాగంగా సోమవారం పరశురామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీభజేనారాయణ స్వామి ఉత్సవమూర్తికి ఆలయ అర్చకులు చిలకమర్తి మురళీకృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు పూజలు చేశారు.

ఎరువుల కొరత లేదు

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజనులో ఇప్పటి వరకు 10,357 హెక్టార్ల విస్తీర్ణంలో వరి, 7,180 హెక్టార్ల విస్తీర్ణంలో ఇతర పంటలు సాగు చేస్తున్నారని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎరువుల సరఫరాకు సంబంధించి అన్ని ఎరువులు కలిసి 60,562 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. జనవరి నెలాఖరుకు వేయబోయే పంటలకు అన్ని ఎరువులు కలిపి 69,338 మెట్రిక్ టన్నుల అవసరం వుండగా వీటిని పూర్తి స్థాయిలో సరఫరా చేసేందుకు వ్యవసాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఈనెల 10వ తేదీలోగా 2,500 మెట్రిక్ టన్నుల యూరియా, 300 మెట్రిక్ టన్నుల డీఏపి ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు. చాలా చోట్ల యూరియా మాత్రమే ఉపయోగించి ఇతర ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, దీనివల్ల భూమిలో పోషకాల సమతుల్యత లోపించి నేల స్వభావం దెబ్బతినే అవకాశం వుందన్నారు. ఇటువంటి విషయాల్లో రైతులు తగిన జాగ్రత్తలు పాటించి ఎరువుల యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా రైతులందరూ పాటించాలని కోరారు.

గిరిజన సాంస్కృతిక మహోత్సవ కరపత్రాల విడుదల




కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవ కరపత్రాలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సోమవారం విడుదల చేశారు. ట్రిబ్యునల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5, 6న జరిగే జాతీయస్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవ కరపత్రాలను రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, యువజన నాయకుడు తోట పవన్‌కుమార్ విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన చరిత్ర, సంస్కృతిని కాపాడుకునేందుకు జాతీయస్థాయిలో గిరిజన సాంస్కృతి మహోత్సవం జరపడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ట్రిబ్యునల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కరంసీ హక్కులప్పనాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణు నాయక్, జనసేన నాయకులు డాక్టర్ అడపా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాస మహోత్సవం

కోరుకొండ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. తెల్లవారుజామున 5గంటల నుంచే భక్తులు ధనుర్మాస ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ఇందు లో భాగంగా రోజూ వెంకటేశ్వరస్వామికి, శ్రీకృష్ణ భగవాన్‌కి, గోదాదేవి అమ్మవారికి పూజలు, అర్చనలు జరుగుతున్నాయి. ప్రతిరోజు 108 మంది భక్తులు తిరుప్పావై పారాయణం చేస్తున్నారు. కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆలయ అనువంశక ధర్మకర్త రంగరాజభట్టర్‌స్వామి ఆధ్వర్యంలో అన్నవరం దేవస్థానం పర్యవేక్షణలో మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తిరుప్పావై గోష్టి, గోదాదేవి గ్రామోత్సవం, శ్రీరంగనాధుని ఆలయం వద్ద ప్రత్యేక సేవాకాలం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పెద్దింటి, పెరవళి, పెదపాటి, అనువంశక అర్చక స్వాములు గోదాదేవి ధనుర్మాస మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆర్యవైశ్య కోదండ రామాలయం వద్ద ఉభయ వేదాంత పండితులు ఇరగవరపు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలు, తిరుప్పావై పారాయణం జరుగుతున్నాయి

వ్యాయామంతో రోగాలు దూరం..



మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మనిషి శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకోవడానికి ప్రధాన కారణంగా సెల్‌ఫోన్ కనిపిస్తున్నదని హైదరాబాద్‌కు చెందిన ఫిజియోథెరపీ వైద్యుడు సంతోష్‌కుమార్, రమేష్ అన్నా రు. సోమవారం అనపర్తిలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని ఉద్యోగులకు నిర్వహించిన ఫిజియోథెరపీపై అవగాహన చేశారు. వారు మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ తమ శరీరంలో వచ్చిన మార్పులతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు వీటి నివారణకు వ్యాయామం చేయాలని సూచించారు. ఎమ్‌పీడీవో మాట్లాడుతూ ఉద్యోగులకు ఎంతో విలువైన శిక్షణను అందించారని వీరి సూచనలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, అధికారులు పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి

గోకవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల నేపథ్యంలో భార్యపై భర్త దాడి చేసిన సంఘటనపై సోమవారం గోకవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ పవన్‌కుమార్ వివరాల ప్రకారం..గోకవరం గ్రామానికి చెందిన ఎం.భవానికి, ఆమె భర్త వెంకటేష్ మధ్య జరిగిన కుటుంబ తగాదాల కారణంగా చాకుతో భర్త వెంకటేష్ భార్యపై దాడి చేశాడు. వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జరిగిన ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబాలకు
ఆర్థిక సహాయం

గోకవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అందిస్తున్న ఆర్థిక సహకారాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా గోకవరంలోని పాత గుబ్బాలమ్మ గుడి వీధికి చెందిన చీపురపల్లి నాగరాజు, బంగాళాపేటకు చెందిన మద్దా డేవిడ్‌రాజు ఇటీవల మృతిచెందారు దీంతో వారి కుటుంబ సభ్యులను శ్రీనివాసరావు పరామర్శించి ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు వరసాల ప్రసాద్, మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, వల్లూరి జగన్నాధశర్మ, కట్టా కళ్యాణ్, ఇనగోటి బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు.

మాలల ఐక్య సమావేశం
విజయవంతం చేయండి



రాజానగరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాజానగరంలో 9న నిర్వహించ తలపెట్టిన మాలల ఐక్య సమావేశాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు మేకల లక్ష్మీపతిరావు, ముప్పిడి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సూర్యారావుపేట కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మాలల హక్కుల సాధన, ఐక్యతకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను హరిస్తూ, అంబేడ్కర్ రాజ్యాంగ స్థానంలో మనుస్మృతిని తీసుకు రావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలకు వ్యతిరేకంగా దళితులను చైతన్యపర్చడం కోసం నిర్వహిస్తున్న ఈ సమావేశానికి మాలల అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కొల్లాటి వెంకన్న, వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో 8న ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా సోమవారం రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన జరిగిన సమీక్షలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ప్రధాన మంత్రి పర్యటన సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లు, పర్యటన విజయవంతంపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, ఎంపీలు భరత్, సీఎం రమేష్, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్షిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

ఆకట్టుకున్న సుందరకాండ హరికథ

అనపర్తి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని శారదా సంగీత కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి హరికథా చూడామణి డాక్టర్ ఎమ్‌వీ సింహాచల శాస్త్రి హరికథా గానం ఆకట్టుకుంది. సుందరకాండలోని ఘట్టాలను ఆయన వివరిస్తూ చేసిన హరికథా గానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. మారెళ్ల గంగరాజు శర్మ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. హరికథా గానానికి పాలపర్తి నాగేశ్వరరావు వయొలిన్ అందించగా అనిల్ కుమార్ మృదంగ సహకారం అందించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తమలంపూడి చిన ఆదిరెడ్డి, కర్రి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హరికథా గానం చేస్తున్న డాక్టర్ ఎంవీ సింహాచలశాస్త్రి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్

బాలల వికాసానికి కృషి చేద్దాం: ఎంపీపీ


కడియం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బాలల వికాసానికి కృషి చేయాలని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ పేర్కొన్నారు. మండల స్థాయి కిషోర్ వికాసం ఒకరోజు శిక్షణ ఎంపీడీవో కె.రమేష్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండల స్థాయిలో శిక్షణ పొందిన వారు గ్రామాల్లో కమిటీలుగా ఏర్పడి పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల మండలంలో జరిగిన పలు అంశాలను గుర్తు చేశారు. మండల కన్వీనర్, ఉత్తమ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కిషోర్ వికాస పథకం 2017లో ప్రారంభమైందన్నారు. సీహెచ్‌వోలు రాము, కుందన సాయిలు పర్సనల్ హైజింగ్‌పై తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రాజెక్టు ఆఫీసర్ ఎ.నాగలక్ష్మి, సీడీపీవో నాగమణి, ఏసీడీపీవో కనకవల్లి, రాజ్‌కుమార్, మండలంలో పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడి

రంగంపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రంగంపేట గ్రామంలో సోమవారం నాటుసారా స్థావరాలపై దాడులు జరిపారు. ఈ దాడిలో అంచూరి ప్రభాకర్ వద్ద 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేయగా, న్యాయస్థానం రిమాండ్‌కు పంపారని ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ దాడుల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





ఇద్దరు యువకుల మృతి బాధాకరం
డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పిఠాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వచ్చి రాజమహేంద్రవరం-కాకినాడ మధ్య గల ఏడీబీ రోడ్డు మీదుగా వెళుతూ ప్రమాదానికి గురై ఇద్దరు యువకులు మరణించడం బాధాకరమని.. ఈ సమాచారం తెలియగానే తీవ్ర ఆవేదనకు గురయ్యాయని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. మృతులు కాకినాడ సమీపంలోని గైగోలుపాడుకు చెందిన మణికంఠ, చరణ్ కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల వంతున జనసేన పార్టీ తరపున ఆర్థికసహాయం అందజేస్తామని ఆయన ఎక్స్(ట్విట్టర్) ద్వారా ప్రకటించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందజేయాలని కార్యాలయ అధికారులకు సూచించినట్టు తెలిపారు.గేమ్ చేంజర్ ఈవెంట్‌లో ఇళ్లకు సురక్షితంగా వెళ్లాలని ఒకటికి రెండుసార్లు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

ఇక నుంచి ఏడీబీ రోడ్డుపైనే
పిఠాపురానికి

కాకినాడ-రాజమహేంద్రవరం నగరాల మధ్య ప్రయాణానికి కీలకమైన ఏడీబీ రోడ్డును గత ప్రభుత్వం ఐదేళ్లపాటు పట్టించుకోలేదని.. కనీసం నిర్వహణ పనులు చేయలేదని, విద్యుద్దీపాలు లేవని పవన్‌కల్యాణ్ విమర్శించారు. దీంతో ఈ రహదారిలో ప్రమాదాలు పెరిగాయని తెలిపారు. ఐదు నియోజకవర్గాలే కాక రెండు జిల్లాల మధ్య ప్రధాన రహదారిగా ఉన్న ఈ రోడ్డు పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి చేపట్టిందని చెప్పారు. అధ్వానంగా ఉన్న ఈ రహదారిని మెరుగుపరిచే పనులు జరుగుతున్న తరుణంలో ఇటువంటి ప్రమాదం జరగడం బాధ కలిగించిందని తెలిపారు. ఇక తాను పిఠాపురం నియోజకవర్గానికి వచ్చేటప్పుడు ఏడీబీ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగించాలని నిర్ణయించుకున్నట్టు పవన్ ప్రకటించారు.



ఉదయం లాకౌట్ సాయంత్రం ఓపెన్!

8

- ఏపీ పేపరుమిల్లు వద్ద ఉద్రిక్తత
- కార్మికుల ధర్నాతో మూసివేత
- ఫలించిన నాయకుల చర్చలు



శరవేగంగా : సాగుతున్న ఏడీబీ రోడ్డు నిర్మాణపనులు

రోడ్డు చేంజర్.. కూటమి

కూటమి వచ్చింది.. ఏడీబీ రోడ్డు బాగుపడింది

ప్రభుత్వం మారింది.. రోడ్డూ మారింది.. అదేమిటంటారా.. రోడ్లకు ప్రభుత్వానికి చాలా దగ్గర సంబంధం ఉంటుంది.. అది నిరూపించిందే.. రాజానగరం- సామర్లకోట ఏడీబీ రోడ్డు.. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. అంతే రోడ్డుకు శని పట్టుకుంది.. ఐదేళ్లూ కదల్లేదు.. రోడ్లంతా గోతులే.. ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.. ఎంతో మంది గాయాలపాలయ్యారు. ఎన్నో వాహనాలు పనికిరాకుండా పోయాయి.. ఆ రోడ్డులో వెళ్లాలంటేనే భయపడేవారు.. మళ్లీ 2024 వచ్చింది.. ప్రభుత్వం మారింది.. వైసీపీ హయాంలో ఐదేళ్లు సాగని పనులు .. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పునఃప్రారంభమయ్యాయి.. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పుడీ రోడ్డు సంగతెందుకంటారా.. శనివారం రాత్రి వేమగిరిలో జరిగిన గేమ్ చేంజర్ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు హాజరై తిరిగి కాకినాడ వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన ఈ రోడ్డపై అందరి దృష్టి పడేలా చేసింది. సాక్షాత్తూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ రహదారి నిర్మాణంలో గత ప్రభుత్వ వైఫల్యం గురించి ప్రస్తావించారు. దీనిలో భాగంగా ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- వైసీపీ హయాంలో నరకమే
- వందలాదిగా ప్రమాదాలు
- గాలిలో కలిసిన ప్రాణాలు
- వేలాది మందికి గాయాలు
- పట్టించుకోని పాలకులు
- 2018లో పనులు ప్రారంభం
- ప్రభుత్వం మారి ఆగిన పనులు
- కూటమి ప్రభుత్వంలో దృష్టి
- శరవేగంగా నిర్మాణ పనులు
- శనివారం ప్రమాదంతో కదలిక

సామర్లకోట/రంగంపేట/రాజానగరం జనవరి 6 : (ఆంధ్రజ్యోతి) : ఏడీబీ రోడ్డును తలచుకుంటే చాలు అటుగా తిరిగేవారెవరైనా అయ్యబాబోయ్ ఆ రోడ్డా అనకమానరు.. ఎందుకంటే అంత అధ్వానం.గత ఐదేళ్లలో ఎంతో మంది ప్రాణాలను బలితీసుకున్న రోడ్డు అది. అయినా గత వైసీపీ ప్రభుత్వంలో కనీస చలనం లేదు. ఐదేళ్లు ఆ రోడ్డు గోతులతోనే నిండి ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో రోడ్డుకు మహర్దశ వచ్చింది.వేగంగా రోడ్డు నిర్మాణపనులు సాగుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం హైవే-కాకినాడ పోర్టుకు అనుసంధానం చేస్తూ రాజానగరం నుంచి కాకినాడ వాకలపూడి లైట్‌హౌస్ వరకూ ఏడీబీ (ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రహదారి) రోడ్డును నిర్మించారు. 1991లో ఆసియా అభివృద్ధి బ్యాంకు నిధులతో ఈ రహదారిని 52 కిలోమీటర్ల మేర ఎంతో పటిష్టంగా నిర్మించారు.

వై..చీప్ పాలన

గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగా ఉన్న కాకినాడ నుంచి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు పెరగడం, రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టుకు ఈ రహదారి అనుసంధానమై ఉండడం వల్ల రోజురోజుకు వాహనాల రద్దీ పెరగడం వల్ల రాజానగరం నుంచి సామర్లకోట వరకు నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని 2014లో టీడీపీ, బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రతిపాదనలు తెచ్చింది. తదనంతరం 2018లో ఉమ్మడి జిల్లాలో రాజానగరం, రంగంపేట మీదుగా పెద్దాపురం, సామర్లకోట, రైల్వే వంతెన వరకు నాలుగు వరుసలుగా 30 కిలోమీటర్ల పొడవైన రహదారి నిర్మాణానికి నాబార్డు నిధులు రూ.300 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో కాంట్రాక్టర్ పనులు చేపట్టి కొంత వరకు పూర్తి చేశారు.మొత్తం రూ.250 కోట్ల వరకు నిధులు విడుదలయ్యాయి.2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత బిల్లులు మంజూరులో జాప్యంతో పనులు నెమ్మదించాయి.ఈ రహ దారి విస్తరణ పనుల్లో భాగంగా ఇరువైపులా లోతుగా తవ్విన ప్రాంతాల్లో గోతులు పూడ్చి పెట్టకుండా వదిలిపెట్టడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. వాహనాలు అదుపుతప్పి రహదారిపై తిరగబడి ట్రాఫిక్ నిలిచి ప్రయాణికులు అవస్థలు చవిచూశారు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు ఈ రహదారి నిర్మాణ పనులను పూర్తిగా గాలి కొదిలేసింది. దీంతో రహదారిపై ఏర్పడిన భారీ గోతులకు వాహనాలు ధ్వంసమైన దాఖలాలున్నాయి.ఎత్తు పల్లాల, గతుకుల కారణంగా ప్రయాణికులు ఈ రోడ్డుపై పడుతూ.. లేస్తూ ప్రయాణం సాగించక తప్పలేదు.ఎన్నికల ముందు అప్పటి సీఎం జగన్ ప్రచారయాత్ర ఈ ఏడీబీ రోడ్డు మీదుగానే సాగింది. నాడు రహదారి బాగుపడుతుందని అంతా ఆశించారు.కానీ కనీసం మరమ్మతు పనులు చేయకపోవడంతో వాహనదారుల్లో నిరాశే మిగిలింది. నిత్యం ఈ రహదారిపై ప్రయాణించే వివిధ కళా శాలలకు చెందిన విద్యార్థులు, ప్రయాణికులు నరకం చూశారు. కాకినాడ-రాజమహేంద్రవరం నాన్ స్టాప్ బస్సులు అనేకసార్లు ఈ రోడ్డులో గోతుల్లో ఇరుక్కుపోయిన ఘటనలు ఉన్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.45 కోట్ల మేర బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్లకు చుక్కలు చూపించింది. దీంతో వారు తీవ్ర నిరాశకు లోనై రోడ్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆపేశారు. కాంట్రాక్టర్ యంత్రాలను తిరిగి తీసుకెళ్లిపోయారు.

నాడు దారి లేదు..



కూటమి మార్పు ఇది..

కూటమి ప్రభుత్వం వచ్చింది.. వెంటనే రహ దారి నిర్మాణంపై దృష్టి సారించింది. రాజానగరం నుంచి సామర్లకోట వరకు నాలుగులైన్లుగా నిర్మిస్తున్న ఏడీబీ రోడ్డు పనులు పెద్దాపురం, కోటపాడు, సూరంపాలెం ఆదిత్య దగ్గర పునఃప్రారంభించారు. ప్రస్తుతం గోతులతో వాహనాలు ప్రయాణం ఇబ్బందిగా ఉన్నచోట మరమ్మతులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనపర్తి, రాజానగరం, జగ్గం పేట, పెద్దాపురం,కాకినాడ రూరల్ ఎమ్మెల్యేల చొరవతో సీఎం చంద్రబాబు పెండింగ్ బిల్లుల్లు చెల్లించడంతో ఏడీబీ రోడ్డు పనులు పునః ప్రారంభించారు. ప్రస్తుతం పనులు కోటపాడు వద్ద శర వేగంగా సాగుతున్నాయి.ఎక్కడైనా చిన్న గొయ్యిపడినా వెంటనే పూడ్చివేస్తున్నారు.

నేడు దారి చూపుతున్నారు..



ప్రాణాలు తీసిన చలిమంట
సజీవ దహనమైన దివ్యాంగుడు



నల్లజర్ల,జనవరి6(ఆంధ్రజ్యోతి): చలిమంట ఒక దివ్యాంగుడి ప్రాణాలు తీసింది. పోలీసుల కథనం ప్రకారం. నల్లజర్ల కోనేరు కాలనీకి చెందిన దానియేలు (24) నూనె ప్యాకెట్లు విక్రయించే దుకాణంలో పనిచేస్తుంటాడు.ఆదివారం రాత్రి భోజనం అనంతరం తాటాకు ఇంటిలో నిద్రకు ఉపక్రమించాడు.ఆ ఇంటి సమీపంలో దానియేలు తండ్రి రామకృష్ణ చలిమంట వేసుకుని కాసేపు కాగాడు.. ఆ తరువాత నిప్పు ఆర్పకుండా ఆరుబయట నిద్రపోయాడు.కాసేపటి తర్వాత చలిమంట నిప్పురవ్వలు తాటికిల్లుకు అంటుకుని మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది.స్థానికులు గమనించి రామకృష్ణను బయటకు తీసుకురాగా దివ్యాంగుడు దానియేలు మంటల్లో సజీవదహనమయ్యాడు.మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు.కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శోభనాద్రి తెలిపారు

సాంస్కృతిక శాఖకు
దామెర్ల ఆర్ట్ గ్యాలరీ : దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 6(ఆంధ్రజ్యోతి): దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని సాంస్కృతిక శాఖకు బదలాయించేందుకు కృషి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్,ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ ఆవరణలో సోమవా రం మాదేటి రాజాజీ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ చిత్రకారుడు వరదా వెంకటరత్నం విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ శాఖ బిల్లులు చెల్లించలేని దుస్థితిలో ఆర్ట్ గ్యాలరీ ఉండడం దురదృష్టకరమన్నారు. ఎంతో విశిష్ట చరిత్ర కలిగిన దామెర్ల రామారావు ఆర్ట్ గేలరీ నిలబడడం వెనుక వరదా వెంకటరత్నం శ్రమ ఎంతో ఉందన్నారు. గేలరీని సాంస్కృతిక శాఖకు బదలాయించే విషయమై సాంకేతిక విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో చర్చిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సన్నిధానం శాస్త్రి, చిత్రకారులు కరణం నూకరాజు,టీకె మృత్యుంజయరావు,ఎస్వీవీఎస్.లక్ష్మి,ఎన్ఎస్.శర్మ పాల్గొన్నారు.

లెప్రసీపై అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో లెప్రసీ వ్యాధికి గురైన వారిని గుర్తించాలని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం జాతీయ లెప్రసీ నిర్మూలన కార్యక్రమం (లెప్రసీ కేస్ డిటెక్షన్ - ఎల్‌సీడీ) ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. లెప్రసీపై అవగాహనకు 1310 బృందాలతో ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను సమన్వయశాఖల ఆధ్వర్యంలో చేపడతామన్నారు. మొత్తం 6,41,680 గృహాలను సందర్శన చేయనున్నామని పేర్కొన్నారు. జిల్లా లెప్రసీ అధికారిణి డాక్టర్ ఎన్.వసుందర,డీఆర్‌వో టి.సీతారామమూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బొమ్మూరు మురళీకొండపై
నాలుగిళ్లు దోపిడీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు మురళీకొండపై నాలుగు ఇళ్లను దొంగలు దోపిడీ చేసారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం.. బొమ్మూరు మురళీకొండపై నివాసం ఉంటున్న ఆర్.నాని, ఐ.ఉమామహేష్,మధుసూదన్ రెడ్డి, కేవీ.రమణ వేర్వేరు చోట్ల నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి నలుగురి ఇళ్లల్లో ఒకేసారి చోరీలు జరిగాయి. ఈ నలుగురి ఇళ్లల్లో 360 గ్రాముల బంగారం ,రెండు లక్షల నగదు అపహరణ దోచుకు పోయారు.ఈ మేరకు నాలుగు సంఘటనలపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.దీంతో మురళీకొండ ప్రజలు భయాందోళన చెందుతున్నారు.ఈ నాలుగిళ్ల తాళా లు వేసి ఉండడం..ఎవరూ లేకపోవడం తో దొంగలు దోపిడీలకు తెగబడ్డారు.

6 ర్యాంపుల్లో సెమీ మెకనైజ్డ్
బోట్లకు అనుమతి

రాజమహేంద్రవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఇసుక సరఫరాలో మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని, 6 ర్యాంపులలో సెమీ మెకనైజ్డ్ బోట్లకు అనుమతివ్వనున్నామని, మరో 10 ఓపెన్ ర్యాంపుల గుర్తించి వాటి ద్వారా 77లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తేనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా కలెక్టర్ చాంబర్‌లో సోమవారం రాత్రి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు.జిల్లాలో 9 డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ప్రస్తుతం 6,47,252 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. దీని కోసం 115 బోట్స్‌మన్ సొసైటీలకు కాలపరిమితితో కూడిన అనుమతులు జారీ చేశామని, ఆలోగానే ఇసుక సరఫరా చేయాలన్నారు. బోట్స్‌మన్ సొసైటీలు కచ్చితంగా మార్గదర్శకాలు పాటించాలని, రవాణా వ్యవస్థ కోసం ర్యాంపుల వద్ద అనువైన వాతావరణం ఉండేలా చూసే బాధ్యత ఏజెన్సీలదేనని స్పష్టం చేశారు. ఓపెన్ రీచ్‌లలో మెకనైజ్డ్ బోట్ల ద్వారా 57,82,950 టన్నుల ఇసుక తీయడానికి పబ్లిక్ హియరింగ్ చేపట్టి టెండర్లు పిలవాలన్నారు. కొత్తగా గుర్తించిన కడియపులంక- వేమగిరి, పెరవలి-తీపర్రు ఏఅండ్‌బీ, నిడదవోలు-జీడిగుంట ఏఅండ్‌బీ, పందలపర్రు నమూనా ప్లాన్ టెండర్ ప్రక్రియ చేపట్టాలన్నారు.సమావేశంలో జేసీ ఎస్. చిన్నరాముడు,అదనపు ఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుష్మిత, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి, ఈఈ కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపు కోసం వివాదం



ప్రభుత్వ జనరిక్ షాపు కోసం రెండు గ్రూపుల మధ్య వివాదం
పోలీసులకు ఫిర్యాదు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనా సర్వజన ఆసుపత్రి (జీటీజీహెచ్) ఆవరణలోని ప్రభుత్వ జనరిక్ మందుల షాపు నిర్వహణపై సోమవారం రెండు మహిళా గ్రూపుల మధ్య వివాదం తలెత్తింది. తమకు జిల్లా మహిళా సమాఖ్య ఐదేళ్ల పాటు రెన్యువల్ ఇచ్చిందని ప్రస్తుతం నిర్వహిస్తున్న మహిళా గ్రూపు చెబుతుంటే.. ఇటీవలే కొత్తగా జిల్లా అధికారులు తమకు జనరిక్ మందుల షాపు నిర్వహణను అలాట్ చేశారని మరో గ్రూపు వాదిస్తోంది. దీంతో జీటీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే ... జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో జనరిక్ మందుల షాపు నిర్వహించుకోవడానికి 2019లో కాళీ కృష్ణ మహిళా సంఘానికి ఐదేళ్ల కాలపరిమితితో అనుమతిచ్చారు. అంతకు ముందు రెండేళ్ల ఇదే మహిళా సంఘం మందుల షాపు నిర్వహించింది. 2024 ఆగస్టు 14న దీని అనుమతి గడువు ముగిసింది. దీంతో మందుల షాపును ఖాళీ చేయాల్సిందిగా కాళీకృష్ణ మహిళా సంఘానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ నోటీసులిచ్చారు. అయినా ఖాళీ చేయలేదు. చివరకు తుది నోటీసు ఇస్తూ, రాజమహేంద్రవరానికి చెందిన ఆదిత్య మహిళా సంఘానికి జనరిక్ మందుల షాపును కేటాయిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో జనవరి 5వ తేదీలోగా ఖాళీ చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పష్టం చేసినా నిర్వాహకుల నుంచి స్పందనలేదు. ఈ నేపథ్యంలో ఆదిత్య మహిళా సంఘం ప్రతినిధులు సోమవారం జీటీజీహెచ్‌లోని జనరిక్ మందుల షాపు వద్దకు వచ్చి షాపు నిర్వహణను అధికారులు తమకు కేటాయించారని వెంటనే ఖాళీ చేయాలని చెప్పడంతో వివాదం ప్రారంభమైంది. తాను ఖాళీ చేసేది లేదని కాళీ కృష్ణ మహిళా సంఘం అధ్యక్షురాలు తనూజ, ఆమె మద్దతుదారులు జనరిక్ మందుల షాపు ఎదుట నిరసనకు దిగారు. రాత్రి సమయంలోనూ ఈ నిరసన కొనసాగుతూనే ఉంది. మరోపక్క కొత్త గ్రూపు ఆదిత్య మహిళా సంఘం స్నేహాంజలి యాదవ్, ఆమె మద్దతుదారులు ఆసుపత్రి ఆవరణలోనే ఉన్నారు.

ఐదేళ్లకు రెన్యువల్ ఇచ్చారు : తనూజ

2017లో నాకు జనరిక్ షాపు ఇచ్చారు. ఆ తర్వాత 2019లో ఐదేళ్లకు రెన్యువల్ ఇచ్చారు. ఇటీవలే 2029 వరకూ నాకు జిల్లా సమాఖ్య రెన్యువల్ ఇచ్చింది. ఖాళీ చేయమని నాకు ఎవరూ చెప్పలేదు.

కలెక్టర్ మాకు ఆర్డర్ ఇచ్చారు : స్నేహాంజలి యాదవ్

ప్రభుత్వాసుపత్రిలోని జనరిక్ మందుల షాపును జిల్లా కలెక్టర్ తమకు కేటాయించారు. సూపరింటెండెంట్ ఇచ్చిన ఉత్తర్వులు తీసుకుని తాము జనరిక్ మందుల షాపు దగ్గరకు వెళితే వాళ్లు రానీయడంలేదు. ఈ విషయాన్ని ఆసుపత్రి అధికారులకు, జిల్లా అధికారులకు తెలియపరిచాం. జన ఔషధి పేరుతో తమకు ఈ షాపు కేటాయించారు.

ఓటర్లు 16,20,888
జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జనవరి6 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్ఆర్ 2025 ప్రకారం జిల్లాలో 16,20,888 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సోమవారం తుది జాబితా ప్రకటించారు. పురుషులు 7,91,043 మంది, స్త్రీలు 8,29,750 మంది, థర్డ్ జండర్ 95 మంది ఉన్నారన్నారు.

గ్రాడ్యుయేట్లు 64,441

జిల్లావ్యాప్తంగా 82 పోలింగ్ కేంద్రాల పరిధిలో 63,441 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు నమోదయ్యారన్నారు. పురుషులు 36,714 మంది, మహిళలు 26,725 మంది థర్డ్ జెండర్ ఇద్దరు ఉన్నట్టు తెలిపారు.త్వరలోనే పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయన్నారు.

పీజీఆర్ఎస్‌కు 120 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు డీఆర్‌వో టి.శ్రీరామ మూర్తితో కలిసి 120 అర్జీలు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజల చెంతకు కలెక్టర్

నల్లజర్లలో పీజీఆర్ఎస్‌కు హాజరైన కలెక్టర్ ప్రశాంతి
వెల్లువెత్తిన సమస్యలు.. పలువురు అధికారుల గైర్హాజరు

నల్లజర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ప్రశాంతి రూటు మార్చారు.. ప్రజలు సమస్యలు పరిష్కరించమని ఆమె వద్దకు రావడం కాదు.. సమస్యలు తెలుసుకోవడానికి ఆమె ప్రజల వద్దకు వెళుతున్నారు. దీనిలో భాగంగా సోమవారం నల్లజర్ల మండల కేంద్రంలో నిర్వహించిన పీజీఆర్‌కు ఆమె హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇక నుంచి ప్రతి వారం ఒక మండలంలో పీజీఆర్‌కు హాజరవుతానని చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించగా భూ సమస్యలు వెల్లువెత్తాయి. నల్లజర్ల సెంటర్‌లో ఆర్అండ్‌బీ ఆక్రమణలు తొలగించకుండా డివైడర్ వేయడం ద్వా రా ప్రమాదాలకు గురై పలువురు మృత్యువాత పడుతున్నారని గ్రామానికి చెందిన పులి బాలాజీ, కండెపు శ్రీనివాస్, కండెపు వెంకటరత్నం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నల్లజర్లలో సర్వీస్ రోడ్డు ఇరుకుగా ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని గుంటముక్కల వేణు ఫిర్యాదు చేశారు. జగన్నాథపురం రోడ్డు అధ్వానంగా ఉందని రోడ్డు నిర్మించాలన్నారు.హైవే రోడ్డులో భూములకు కన్వెక్షన్ చేసిన సొమ్ములు రాలేదని రైతులు కలెక్టర్ వద్ద వాపోయారు. అయ్యవరంలో ఉన్న తన రెండెకరాల భూమిని కబ్జా చేసినట్టు రైతు కంచె వెంకట సత్యనారాయణ ఫిర్యాదు చేశారు.సింగరాజుపాలెంలో ఒక నాయకుడు తమ భూమిని కబ్జా చేశాడని ఒక వృద్ధురాలు కలెక్టర్‌కు విన్నవించింది. నల్లజర్లలో జగనన్న కాలనీకి రోడ్డు వేయడం లేదని గ్రామానికి చెందిన బావిరెడ్డి సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. చీపురుగూడెం గ్రామంలో రీసర్వేలో అవకతవకలు జరిగినట్టు రైతు కంపన దుర్గారావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పొలానికి దారివ్వడం లేదని నల్లజర్లకు చెందిన రైతు కూచిపూడి వెంకట రత్నం చెప్పగా వెంటనే వీఆర్వో లక్ష్మణమూర్తిని పంపించి దారి ఏర్పాటు చేయాలని ఆదేశించారు.సమా వేశానికి ఆర్అండ్‌బీ అధికారులు గైర్హాజరు కావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ స్వామి నాయుడు,డీటీ శాంతిప్రియ,సివిల్ సప్లైస్ డీటీ సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.



నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

తప్పుల తడకగా కులగణన సర్వే


అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

చర్యలు తీసుకోవాలంటూ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

కొవ్వూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 7 ఫిర్యాదులు స్వీకరించినట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ మండలాల నుంచి ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందించి త్వరగా పరిష్కరించాలన్నారు. భవన నిర్మాణ సమయంలో గాయపడిన కార్మికుడిని ఆర్థికంగా ఆదుకోవాలని, గత వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్లతో చేపట్టిన కులగణన జాబితా తప్పుగా నమోదు చేశారని, చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని, కొవ్వూరు ఆర్అండ్‌బీ బంగ్లా ప్రాం గణంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయని, వాటిని తొలగించాలని, పంట భూ మిలో వేసిన విద్యుత్ స్తంభాలు తొలగించాలని, తిరుగుడు మెట్ట బీసీ, ఎస్సీ వార్డుల్లో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, ధర్మవరంలో రీసర్వేలో భూమి తక్కువగా చూపిస్తున్నారని, సరి చేయాలని ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో 3 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించినట్టు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు.

కోటసత్తెమ్మ దేవస్థానానికి రూ.లక్ష విరాళం


దేవస్థానానికి విరాళం అందజేస్తున్న దాతలు

నిడదవోలు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన కుందేటి నిఖిల్ రంగారావు కుటుంబం రూ.లక్ష విరాళం అందించారు. విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ జిల్లా సోమ రాజుకు అందజేసినట్టు సహాయ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ తల్లిని, నిడదవోలులో నంగాలమ్మ ఆలయాలను భారత చైతన్య యువజన పార్టీ అధినేత బొడ్డు రామ చంద్రయాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో తీర్థాల రామచంద్రరావు, గాలి బంగారయ్య, గుడ్ల వెంకటనారాయణ, గుడ్ల వెంకట నారాయణ, గుడిగుంట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో మహిళ అనుమానాస్పద మృతి


మృతురాలు పద్మావతి

కొవ్వూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. పట్టణంలోని బాలదారి వారి వీధిలో నివాసం ఉంటున్న కాకి పద్మావతి(42) సోమవారం ఇంట్లో చీరతో ఉరి పోసుకుని మృతి చెందింది. పద్మావతి భర్త రామకృష్ణ 14 ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో పద్మావతి సోదరుడు మండా ఆనంద్‌బాబుతో కలిసి కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో కిరాణా, ఐస్‌క్రీమ్ వ్యాపారం ప్రారంభించారు. వ్యాపారంలో నష్టం రావడంతో ఆనంద్ బాబు 6 నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం పద్మావతి బావ కక్కిరాల సూరిబాబు ఇంట్లో కుమారుడు సూర్య యశ్వంత్‌తో కలిసి నివసిస్తోంది. సోదరుడి మరణం, ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెందిన పద్మావతి సోమవారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. ఆ సమయంలో బయటకు వెళ్లిన సూరిబాబు అతడి భార్య పద్మ ఇంటికి వచ్చి చూసేసరికి చీరతో ఉరి పోసుకుని వేళాడుతున్న పద్మావతిని చూసి కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న సీఐ పి.విశ్వం పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి సోదరుడు మండా జగదీష్ అందించిన ఫిర్యాదుపై కేసునమోదు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఎస్ఎస్ఏ ఏటీ సంస్థ రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ సూర్య


దేవరపల్లి హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సూర్య

దేవరపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎస్ఏ ఏటీ సంస్థ రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ సూర్య అన్నారు. దేవర పల్లిలో జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులను భోజనం ఎలా ఉంటుందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన, రుచిక రమైన భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ డీ.వేములరాజు, హెచ్ఎం శ్రీలక్ష్మి, పీఈటీ ఓరుగంటి నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషకాహార వాటిక పరిశీలన

తాళ్లపూడి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద సోమవారం పోషకాహార వాటిక కార్యక్రమాన్ని కొవ్వూరు సీడీపీవో మమ్మి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం వద్ద ఖాళీ స్థలంలో పండించిన ఆకుకూరలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలకు భోజనంలో ఆకు కూరలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి, సూపర్‌వైజరు భానుమతి, కార్యదర్శి కామేశ్వరి, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

భారత చైతన్య యువజన పార్టీ అధినేత రామచంద్రయాదవ్


బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న రామచంద్ర

ఉండ్రాజవరం, జనవరం 06 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రులో విద్యుదాఘాతంతో మృతిచెందిన కుటుంబాల పిల్లలకు తమ పార్టీ అండగా ఉంటుందని భారత చైతన్య యువజన పార్టీ అధినేత రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. సోమవారం తాడిపర్రులో విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన నలుగురు కుటుంబాలను ఆయన పరామర్శించి, మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో యువత ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తొలుత సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని రామచంద్రయాదవ్ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అనూషయాదవ్, పాల రమేష్, హరిబాబు, అత్తిలి రాజు, బర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- కారును ఓవర్ టేక్ చేస్తూ హెచ్చరిక బోర్డును ఢీకొన్న బైక్
- ఓ యువకుడు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు


మృతుడు గణేష్‌కుమార్

పెరవలి, జనవరి6(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఖండవల్లికి చెందిన పెదపూడి శక్తి గణేష్ కుమార్(25), స్నేహితుడు చేశర్ల వినయ కుమార్ కలిసి మోటారుసైకిల్‌పై తణుకు నుంచి ఖండవల్లి వస్తుండగా రవళి స్పిన్నింగ్ మిల్లు వద్ద కారును ఓవర్‌టేక్ సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న హెచ్చరిక బోర్డును ఢీకొట్టారు. ఈ ఘటనలో గణేష్‌కుమార్ అక్కడిక్కడే మృతి చెందగా వినయ్‌కుమార్‌కు తీవ్ర గాయాల య్యాయి. అతడిని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

ఉండ్రాజవరం, జనవరం 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ చెప్పారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎస్ఐ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కోడిపందాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఏపీ పేపరుమిల్లు లాకౌట్

- వేతనం రూ.10,500 పెంచాలని కార్మికుల డిమాండ్
- ఎన్నికల నుంచి దఫదఫాలుగా ఆందోళన
- ఐదు రోజులుగా కార్మికుల సమ్మె
- అయినా దిగిరాని యాజమాన్యం
- సోమవారం లాకౌట్ ప్రకటన
- రోడ్డెక్కిన 2 వేల మంది కార్మికులు
- ఫ్యాక్టరీ ఎదుట ఉద్రిక్తత
- లాకౌట్ ఎత్తివేయాలని కార్మిక సంఘాల డిమాండ్



పేపరు మిల్లు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పేపరు మిల్లును మూసివేశారు. నూతన వేతన ఒప్పందం చేయాలని ఆంధ్రప్రదేశ్ పేపరు మిల్లు కార్మికులు చేపట్టిన సమ్మెతో మిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. మిల్లు కార్మికులు గత కొద్ది నెలలుగా నూతన వేతన ఒప్పందం కోసం నిరసనలు చేపట్టిన సంగతి విదితమే. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెండు దపాలుగా యాజమాన్య ప్రతినిధులు, కార్మిక యూనియన్లతో ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ప్రశాంతి సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో కార్మికుల డిమాండ్‌ను యాజమాన్యం అంగీకరించలేదు. మిల్లులో రెగ్యులర్ కార్మికులు సుమారు 800 మంది, కాంట్రాక్టు కార్మికులు 2 వేల మంది పనిచేస్తున్నారు. నూతనంగా కార్మికుడికి రూ.10,500 పెంచుతూ వేతన ఒప్పందం చేయాలని కార్మికసంఘాలు డిమాండ్ చేశాయి.మిల్లు యాజమాన్యం రూ.3500 పెంచుతామని తెలియజేసింది. దీనికి కార్మికులు నిరాకరించారు. మిల్లు రూ.1200 కోట్ల లాభాల్లో ఉండగా కార్మికుల వేతనాలు పెంచడంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని కార్మిక సంఘాలు మండిపడ్డాయి. ఈ మేరకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు అమరావతిలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శితో సమావేశం నిర్వహించి కార్మికులకు న్యాయం చేయాలని, అందుకు ఒక కమిటీని వేయాలని ఆదేశించడం జరిగింది.ఈ మేరకు మిల్లులో ఐదు రోజులుగా సమ్మెలో ఉన్న కార్మికులకు ఆదివారం ప్రజాప్రతినిధులు మద్దతు ప్రకటించి విషయాన్ని తెలిపారు. కొద్ది నెలలుగా చేస్తున్న ఆందోళన కార్మికులు విరమించాలని.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పివెళ్లారు. అయినా కార్మికులు దిగిరాలేదు. దీంతో యాజమాన్య మొండి వైఖరి ప్రదర్శించింది. తెల్లారేసరికి అనుహ్యంగా పేపరుమిల్లు యాజమాన్యం మెయిన్ గేటుకు లాకౌట్ నోటీసులను అం టించి మిల్లును క్లోజ్ చేసింది. దీనిపై విస్మయం చెందిన కార్మికులు సోమవారం ఉదయం 6గం టల నుంచే మిల్లు వద్ద ఆందోళనకు దిగారు. అగ్రిమెంట్ చేయమంటే దాని ని చేయకుండా లాకౌట్ ప్రకటించిన యాజమాన్య వైఖరిని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి, కార్మికులంతా రోడ్డెక్కడంతో పేపరుమిల్లు -సీతంపేట రోడ్డు కార్మికులతో బ్లాక్ అయ్యింది. సంఘటనా స్థలానికి భారీగా పోలీసులు చేరుకున్నారు. కార్మికుల ఆందోళన కొనసాగుతుంది. పేపరుమిల్లు కార్మికులకు అండగా కార్మిక సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు నిలిచారు. కార్మికుల ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. పేపరుమిల్లు కార్మికుల రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్ళ శిరామసుబ్రహ్మణ్యం, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు అరుణ్, కె.రాంబాబు మద్దతు తెలిపారు. అయితే రాత్రి కూటమి నాయకులు జరిపిన చర్యలు సఫలమై వారి హామీ మేరకు కార్మికులు సమ్మె విరమించారు. దీంతో లాకౌట్ ఎత్తివేశారు.

యాజమాన్యం దిగిరావాలి

పేపరుమిల్లు యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుంది. కార్మికులు నాయపరమైన అగ్రిమెంట్ చేయడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యహరించడాన్ని ఖండిస్తున్నాం. కార్మికులకు అన్యాయం జరుగుతుంది. యాజమాన్యం దిగిరాకపోతే సహించేదిలేదు. లాకౌట్ ప్రకటిస్తే భయపడే పరిస్థితి లేదు. కూటమి ప్రజాప్రతినిధులు కార్మికులవైపు నిలబడాలి. రెండు రోజుల్లో యాజమాన్యం నుంచి సానుకూల ప్రకటన రాకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శివరామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కార్మిక చట్టాలను యాజమాన్యం పట్టించుకోకుండా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తుంటే సహించేదిలేదని హెచ్చరించారు.

-జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే.


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఆధార్ ఆధారంగానే ఎరువుల సరఫరా

- మలకపల్లిలోని ఎల్ఎస్‌సీఎస్ సొసైటీ తనిఖీలో ఆర్డీవో రాణి సుస్మిత


మలకపల్లిలోని సొసైటీ గొడౌన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో సుస్మిత

తాళ్లపూడి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రైతులకు పురుగు మందులు సరఫరా చేసే క్రమంలో రైతు వివరాలు నమోదు చేసి ఆధారుకార్డు నెంబరు ఆధారంగానే సరఫరా చేయాలని ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. మండలంలోని మలకపల్లిలోని ఎల్ఎస్‌సీఎస్ సొసైటీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు కావలసిన ఎరువులు, పురుమందులు అందేలా చర్యలు తీసుకుంటోందని, రైతు సాగు చేసే విస్తీర్ణం మెరకు ఎరువులను అందించాల్సి ఉందన్నారు. మండలం పరిధిలో అవసరం మేరకు బఫర్ స్టాకు ముందుగానే ఇండెంటు పెట్టి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంట వ్యవసాయాధికారిణి రుచిత, సొసైటీ సభ్యులు ఉన్నారు.

యూరియా అవసరానికి మించి వాడొద్దు

గోపాలపురం: స్థానిక సొసైటీ ఎరువుల గొడౌన్‌లో యూరియా స్టాక్‌ను మండల వ్యవసాయాధికారి రాజారావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత రెండురోజుల్లో సుమారు 290మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. ఆరు సొసైటీల పరిధిలో మన గ్రోమోర్ సెంటర్ అందుబాటులో ఉందన్నారు రైతులు అవసరానికి తగిన మోతాదులో మాత్రమే యూరియా వినియోగించాలన్నారు. అధిక మోతాదులో వాడడం పంటకు అనర్థమని అన్నారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడంతో రైతులు వాటి కొనుగోలు తగ్గించి దానికి బదులు యూరియాను అధిక మోతాదులో వాడుతున్నారని, దీని ప్రభావంతో పంటకు కావల్సిన సమగ్ర పోషకాలు సక్రమంగా అందకపోవడంతో పాటు దిగుబడి తగ్గే ప్రమాదముందన్నారు. యూరియా పరిమితికి మించి వాడితే మొక్క ఏపుగా పెరగంతోపాటు పచ్చదనం ఎక్కువయ్యి పురుగులు, తెగుళ్లకు ఆకర్షించబడుతుందన్నారు. వాటిని నివారించడానికి రైతులకు ఖర్చు ఎక్కువయ్యే అవకాశం ఉందన్నారు. రైతులు రసాయనక, సేంద్రీయ ఎరువుల సమపాలల్లో వినియోగించి దిగుబడి పెంచుకోవాలని ఏవో సూచించారు.

కొవ్వూరు: కొవ్వూరులోని సొసైటీ వద్ద యూరియా నిల్వలను మండల వ్యవసాయాధికారి ఎ.గంగాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వూరు మండలంలోని పీఏసీఎస్ సొసైటీల్లో 10 రోజుల్లో 380 మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. యూరియాలో నత్రజని 46శాతం ఉంటుందని, 3 దశల్లో నాట్లు వేసే సమయంలో, పిలకలు తొడిగేటప్పుడు, చిరుపొట్ట దశల్లో ఎకరానికి 30నుంచి 40 కిలోలు వేసుకోవాలన్నారు. అవసరానికి మించి యూరియా వాడొద్దని ఏవో పేర్కొన్నారు.


గోపాలపురంలో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏఎస్‌వో రాజారావు


కొవ్వూరులో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏవో గంగాధర్

అంబేడ్కర్ జీవితంపై విద్యార్థులకు పోటీ పరీక్షలు

దేవరపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): యర్నగూడెంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బీఆర్ అంబేడ్కర్ జీవితంపై విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. మొదటి స్థానం సాధించిన షేక్ షకీల్, ద్వితీయస్థానం సాధించిన గౌతమి వారికి బాలోత్సవ కమిటీ బహుమతులు అందజేసింది. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ సభ్యులు ఉండవల్లి కృష్ణారావు, ఆచంట సుభాష్‌చంద్రబోస్, దుగ్గిరాల సత్యం, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గద్దే శ్రీనివాస్, బొల్లిన విజయభాస్కర్, గ్రంథాలయాధికారి అనిత పాల్గొన్నారు.

దేవరపల్లిలో పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

దేవరపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి పంచాయతీ పరిధిలో పారిశుద్యం కుంటుపడింది శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికిషోర్, గ్రామంలోని అన్ని వీధుల్లో ట్రాక్టర్లు, పారిశుద్య వ్యాన్‌లు ఏర్పాటు చేసి పంచాయతీ కార్మికులతో చెత్తను తొలగించారు. వీధుల్లోని పారిశుద్య పనులను వార్డు సభ్యులు పచ్చా రామ్‌గోపాల్, కరుటూరి బాలాజీ పర్యవేక్షించారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ


మహిళలకు కుట్టుమిషన్‌లను పంపిణీచేసిన ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాలని ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న సచివాలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ ఆధ్వర్యంలో 14 రోజులుగా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ సోమవారం ముగిసింది. శిక్షణ పూర్తిచేసుకున్న 25 మంది మహిళలకు కోల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సీఎస్ఆర్ ప్రాజెక్టులో భాగంగా రూ.30 వేలు విలువైన 25 హైస్పీడ్ కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. తీగెల రాజా మాట్లాడుతూ రోటరి క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో యోగా తరగతులు ప్రవేశపెట్టాలన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ కుట్టు మిషన్‌లు తీసుకున్న మహిళలు వాటిని ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఇమ్మని వెంకట్, రోటరీ జిల్లా గవర్నర్ సుబ్బారావు దత్త, తీగెల రాజాసురేష్ ఉదయగిరి, కంటమణి రామకృష్ణారావు, టీవీ రామారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో ఉంటున్నా..పుట్టిన ఊరు గురుతే!

- మురమండలో ఆలయాభివృద్ధికి రూ.20 లక్షల విరాళం
- ఎన్ఆర్ఐ వెంకట్రావు దాతృత్వం


మురమండ సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎన్ఆర్ఐ వెంకట్రావు-సత్యదుర్గావాణి దంపతులు

కడియం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎక్కడున్నా.. ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన ఊరు.. కన్నతల్లిని మరువకూడదనేది మన పెద్దల మాట..జిల్లాకు చెందిన ఒక ఎన్ఆర్ఐ అదే చేస్తున్నారు. పుట్టిన ఊరుకి తన వంతుగా సేవ చేస్తున్నారు. కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన ముద్దుల వెంకట్రావు ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. తాను పుట్టిన ఊరుకి ఏదో ఒకటి చేయాలనేది ఆయన ఆశ. ఈ మేరకు సుమారు రూ.20 లక్షలు పైగా స్వీయ నిధులు ఇచ్చి గ్రామం లో సర్వకామదాంబ సోమేశ్వరస్వామి ఆలయంలో మండ పం ఆధునీకరణ, గ్రానైట్, రంగులు, టైల్స్ వేయించాడు. అంతే కాకుండా పండితుల సలహా మేరకు సోమవారం దాత ముద్దుల వెంకట్రావు - సత్యదుర్గావాణి దంపతులు ముందుగా గణపతిపూజ, సర్వకామదాంబ సోమేశ్వరస్వామికి మహా త్రిపుర సుందరీ సమేత పంచ సహస్ర పార్థివ లింగార్చన, అభిషేక హవన మహారుద్ర కల్పం, శాంతి కల్యాణం చేశారు. ఈ పూజలో మట్టితో తయారు చేసిన 5 వేల శివలింగాలను ఉంచారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి శాంతి కల్యాణం, హోమ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

చాగల్లు, జనవరి 6, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలటూరుకు చెందిన ఇద్దరు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి సాయాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం అందజేసారు. కొవ్వూరులో జరిగిన కార్యక్రమంలో తాళ్లూరి శివరామకృష్ణకి రూ.25,082, మానేపల్లి సాయికుమార్‌కి రూ.99,508 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గం నాయకులతో పాటు నెలటూరుకు చెందిన తాళ్ళూరి ప్రసాద్, తాళ్ళూరి శ్రీనివాసరావు, ఈడుపుగంటి మురళి, ఈడుపుగంటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో త్వరగా ప్రయోజనం: పీడీజే

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వం ద్వారా సమయం వృథా కాదని, త్వరగా ప్రయోజనం సమకూరుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థలో పీడీజే సునీత ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరిగే మధ్యవర్తిత్వ తర్ఫీదు కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దీని వల్ల సామరస్యపూర్వకంగా కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ గాయత్రి దేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాష్‌బాబు, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన 24 మంది న్యాయమూర్తులు పాల్గొన్నారు.